

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర




వ్యవస్థాపక సంపాదకులు : బి. వి. ఎల్. ఎన్. రాజు

సంపుటి : 29 | సంచిక : 7 | మార్చి 2024


## ఈ సంచికలో. . . .


సత్వగుణం ప్రాక్టీసు చెయ్యాలి ........................ 2

సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు....... 4

భగవద్గీత ...................................... 27


**ఇతర విషయములు :**


చావలి సూర్యనారాయణమూర్తి గారి వ్యాసం

సాగిరాజు రామకృష్ణంరాజు గారి వ్యాసం




నీ హృదయంలో ఉన్న
ఆనందం నీ మనస్సుకు అర్థం
అయినప్పుడు ఆ రుచి నీ
మనస్సుకు తెలిసినప్పుడు
దానంతట అదే దాని
మూలంలోకి వెళ్లి
ఐక్యమవుతుంది.


రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 28

గౌరవ సంపాదకులు

శ్రీమతి P. H. V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రు॥ 150/-

విడి ప్రతి : రు॥ 15/-



చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు – 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు – 534 265

9441122622

7780639977

ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్. వి. ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747

డిజైనింగ్

అనన్య జిరాక్స్ & నెట్ సెంటర్

(నందిగామ శేషసాయి)

పి. పి. రోడ్డు, లజపతిరాయ్ పేట,

పాలకొల్లు, 9397151342

# సత్వగుణం ప్రాక్టీసు చెయ్యాలి

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణముల నుండి సేకరణ)

యజ్ఞయాగాదుల వల్ల బ్రహ్మానుభవం కలుగదు, బ్రహ్మాకారం పొందలేవు. ఒక్క జ్ఞానం వల్ల మాత్రమే బ్రహ్మాకారం పొందుతావు. రమణమహర్షి గారు ఏది చెప్పినా మళ్ళీ జ్ఞానం దగ్గరికి వచ్చేస్తారు, . మేము జపం చేసుకొంటున్నాము, ధ్యానం చేసుకొంటున్నాము, లేకపోతే తపస్సు చేసుకొంటున్నాము అంటే చేసుకో అంటారు. చేసేదానిని పాడుచెయ్యరు, చేసుకో చేసుకో అంటూ మళ్ళీ జ్ఞానం దగ్గరికి వచ్చేస్తారు. అంటే ఆ సద్వస్తువు మీకు తెలియబడాలి. జపంలో, పూజలో, నామంలో, అన్నిటిలోనూ ద్వైతం ఉంది. ఆ ద్వయీభావ రహితమైనటువంటి స్థానానికి రావాలి. అదే పరమస్థితి అదే పరబ్రహ్మం.

ద్వైతబుద్ధికి మూలం మనస్సులో, దేహము నేను అనే తలంపులో, అహంభావనలో ఉంది. ద్వైతబుద్ధిలోనుంచి అసూయ, కోపం, కోరిక, గుణాలు అన్నీ వస్తున్నాయి. ఈ మాయ అంతా అక్కడినుంచే వస్తోంది. ఈ అవిద్య, ఈ అజ్ఞానం అంతా అక్కడినుంచే వస్తోంది. ఆ ద్వైతబుద్ధి అనే గడప దాటితే ఏమీ లేదు. అంతా నువ్వే అయినప్పుడు ఇంక నీకు ద్వైతబుద్ధి ఉండదు. నీవు నేను అనే భేదబుద్ధి రాలిపోతుంది. అక్కడికి రావాలంటే నువ్వు జ్ఞానం లేకుండా రాలేవు. మనకి సద్వస్తువు అనుభవంలోకి రావాలంటే గుణాలకి అతీతంగా ఉండాలి. ఒకేసారి మనం గుణాలకి అతీతంగా ఉండలేము కాబట్టి సత్వగుణాన్ని ఆశ్రయించమన్నారు. సత్వగుణాన్ని ఆశ్రయిస్తే, అది సద్వస్తువుని తెలుసుకోవటానికి మనకి సహకరిస్తుంది. డాక్టర్ మెడిసిన్ ఎలా ప్రాక్టీస్ చేస్తాడో, లాయర్ ఏ విధంగా అయితే లాని ప్రాక్టీస్ చేస్తాడో, అలా నీవు సత్వగుణాన్ని ప్రాక్టీస్ చెయ్యాలి. సత్వగుణం కూడా గుణమే. అది అహంభావనలోనుంచి వచ్చింది. కాని అది మంచిగుణం. మంచిగుణం అంటే ఏమిటంటే భగవంతుని తెలుసుకోవటానికి మార్గం చూపించి అది పక్కకి తప్పుకుంటుంది. సత్వగుణాన్ని బాగా ప్రాక్టీసు చేయాలి అనుకుంటారు మీరు, మరి చేయగలరా? అంటే, నేను చెప్పే మాటలలో మీ ఫీలింగ్ ఏమైనా హర్ట్ అయ్యింది అనుకోండి, ఎవరైనా బెడ్డ వేస్తే మీ శరీరానికి ఎలా దెబ్బ తగులుతుందో, అలా మీ దేహాభిమానానికి ఏదైనా గాయం తగిలినట్టు అనిపించింది అనుకోండి సడన్‌గా అక్కడే మీ సత్వగుణం వదిలేస్తారు, రజోగుణంలోకి వెళ్ళిపోతారు.

సత్వగుణం ప్రాక్టీసు చెయ్యండి అని చెప్పటం తేలిక. శుభ్రంగా పొద్దున్న భోజనం చేసి మధ్యాహ్నం టీ తాగి ప్రశాంతంగా కూర్చుని మాటలు చెప్పుకోవటానికి ఏముంది! మీరు సత్వగుణంలో ఉండగలరా లేదా అనేది మీ ఫీలింగ్ హర్ట్ అయినప్పుడు తెలుస్తుంది. ఇప్పుడు హాయిగా నీడలో ఉన్నాము, ఎండా లేదు, చలీ లేదు, వర్షం లేదు, శుభ్రంగా

భోజనాలు చేసి కూర్చునాం, మళ్ళీ డిన్నర్‌కి సిద్ధం అవుతున్నాము. అసలు భూమి మీదకి ఎందుకు వచ్చామో, ఏ పని మీద వచ్చామో ఆ పని పూర్తిగా మరిచిపోయాము. ఆ పని రవ్వంత ముల్లంత జ్ఞాపకం ఉంటే సత్వగుణాన్ని విడిచిపెట్టం! మనం ఈ భూమి మీదకి ఏపని మీద వచ్చామో ఆ పనిని జ్ఞాపకం చేసేదే సత్వగుణం.

మీరందరూ ఇప్పుడు సత్వగుణం లోనే ఉన్నారు, కాని మీ ఫీలింగ్ హర్ట్ అయినప్పుడు, మీకు పరిస్థితులు అనుకూలంగా లేనప్పుడు ఉన్న కాస్తో కూస్తో సత్వగుణం చెదిరిపోతుంది, రజోగుణం వచ్చేస్తుంది, తమోగుణం వచ్చేస్తుంది. లోపల రజస్సు ఏమిచేస్తుందంటే, లోపల తమస్సు ఏమిచేస్తుందంటే ఆ సత్వగుణాన్ని బయటికి గెంటేసి, అది వేగంగా వచ్చేస్తుంది. మనకి రజోగుణం తమోగుణం పూర్వజన్మల నుంచీ సహజంగా ఉన్నాయి. ఇప్పుడు ఏమైనా మీటింగులకి వెళ్ళి, సాయిబాబా గుడికో, వెంకటేశ్వరస్వామి గుడికో, శివాలయానికో వెళ్ళి ఏదో నేర్చుకొంటున్నాము. నేర్చుకొన్నది ఎంతసేపు ఉంటుంది! ముఖంలో సహజమైన అందం వేరు, పౌడరు రాసుకుంటే ఎంతసేపు ఉంటుంది? పౌడరు రాసుకున్నా అందంగానే ఉంటుంది కాని, కాస్త ఎండలోకి వెళ్ళి ఒక నిమిషం నుంచుంటే ఆ అందం చెరిగిపోతుంది. మామూలుగా ముఖంలో ఉన్న అందం వేరు, పౌడరు రాసుకొని, స్నో రాసుకొని వచ్చే అందం వేరు. పెళ్ళికూతురుని కూడా అందంగా చెయ్యవచ్చు. కాని ఒకగంట ఎండలో ఉంటే మళ్ళీ మామూలు ముఖం వచ్చేస్తుంది. మనం ఇప్పుడు సత్వగుణాన్ని నేర్చుకొంటున్నాము. సబ్బుపెట్టి ముఖాన్ని కడుక్కున్నట్టు సత్వగుణాన్ని నేర్చుకొంటున్నాము. అది మనకి సహజం అవ్వలేదు. నేర్చుకొన్నది ఎంతసేపు ఉంటుంది! రజోగుణం తమోగుణం మనకి సహజంగా ఉన్నాయి. రజోగుణం అవసరమైనప్పుడు ఎంతో వేగంగా వచ్చేస్తుంది. అంటే రైలు ఇంజను చక్రం కింద మీ తలకాయని పెడితే ఏమీ కష్టం లేకుండా మీ తలకాయని తీసేస్తుంది. అదేవిధంగా రజోగుణం కూడా వచ్చి సత్వగుణం తలకాయని తీసి అవతల పారేస్తుంది. ఇప్పుడు మనకి రజోగుణం, తమోగుణం ఎంత సహజంగా ఉన్నాయో, సత్వగుణం కూడా అంత నాచురల్‌గా, తెచ్చిపెట్టుకున్నట్టు కాకుండా, సత్వగుణాన్ని మనం ప్రాక్టీసు చెయ్యాలి. ఇప్పుడు మనం ఎంతోకొంత సత్వగుణం నేర్చుకొంటున్నాము. గుడి దగ్గరికి వెళ్ళి ఇంకోచోటికి వెళ్ళి ఏదో రకంగా నేర్చుకొంటున్నాము. నేర్చుకున్నది వేరు నాచురల్‌గా వచ్చింది వేరు. పుట్టుకతోటి వచ్చిన సత్వగుణం వేరు, నేర్చుకున్న సత్వగుణం వేరు. అయితే కొన్ని జన్మలు నేర్చుకోగా నేర్చుకోగా సత్వగుణం సహజం అవ్వవచ్చు. అలాగని నేర్చుకోవటం మానకూడదు. అంటే మనకి సత్వగుణం ఎప్పుడు వస్తుంది అంటే, సత్వగుణాన్ని సంపాదించాలి అనుకొన్నప్పుడు, ఆ సత్వగుణం వచ్చినప్పుడు మనం ఎంత సంతోషంగా ఉంటామో, ఆ సత్వగుణం కోసం ప్రయత్నం చేసేటప్పుడు కూడా అంత సంతోషంగా ఉంటే అది వచ్చేస్తుంది. ఈ జన్మలోనే వచ్చేస్తుంది.

ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

# సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - 3 డిసెంబరు 1995, కేశవరం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

జ్ఞానం గురించి శ్రవణం చెయ్యాలి. మనం యజ్ఞ యాగాదులకి ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తాము. శ్రవణం చెయ్యడానికి ప్రాముఖ్యత తక్కువ ఇస్తాము. సర్వసాధారణంగా హిందూ మతంలో పూజలకి విలువ ఎక్కువ ఉంటుంది, శ్రవణం చెయ్యడం తక్కువ ఉంటుంది. భగవంతుడి సందేశాన్ని మనం జాగ్రత్తగా శ్రవణం చెయ్యవలసిన అవసరం ఉంది. శ్రవణం చేసి, మనం అర్థం చేసుకుంటుంటే డైరెక్ట్ experience కాకపోయినప్పటికీ పరోక్షంగా అయినా విషయం తెలుస్తుంది. మనం శ్రద్ధగా వింటే, ఆ విన్న విషయాన్ని మనం మననం చేసుకుంటూ ఉంటే అది నెమ్మదిగా మనకి అనుభవంలోకి వస్తుంది. దానికి కొంత టైము పడుతుంది. ఇది డైరెక్ట్‌గా మీకు అనుభవంలోకి వచ్చే విషయం అని భగవంతుడు చెప్పాడు. అంటే మీ ఊహాగానాలతోటి పనిలేదు. మీకు అర్థం అయిన విషయం మీకు అనుభవంలోకి వస్తుంది ప్రాక్టీస్ చేస్తే అని తొమ్మిదవ అధ్యాయంలో భగవంతుడు కృష్ణుడు detailedగా చెప్పటం జరిగింది.

అంతటా వ్యాపించిన బ్రహ్మమే సత్యమైన ఆత్మగా, యదార్థమైన ఆత్మగా, ఆ సద్వస్తువు మన హృదయంలో కూడా ఉంది. పరమేశ్వరుడు నేను అందరి హృదయాలలోను ఉన్నాను అని చెప్పాడు. ఉపాధుల్లో తేడా ఉంది. కొన్ని ఉపాధులు స్త్రీలుగా ఉన్నాయి, కొన్ని ఉపాధులు పురుషులుగా ఉన్నాయి, కొన్ని ఉపాధులు తెల్లగా ఉన్నాయి, కొన్ని ఉపాధులు నల్లగా ఉన్నాయి. ఈ బేధాలు అన్నీ కూడా ఉపాధులకి సంబంధించినవే కానీ లోపల ఉన్న వస్తువు మటుకు సమానంగా ఉంది. ఈ హెచ్చు తగ్గులు అన్నీ ఉపాధులకి సంబంధించినవే. అంటే ఉపాధి దృష్టి మనకి ఉన్నప్పుడు భగవంతుడు కూడా ఇలా ఉన్నాడేమో అనుకుంటాం. అలా లేడు భగవంతుడు. అందరి హృదయాలలో సమానంగా ఉన్నాడు, ఈ బేధాలు అన్నీ కూడా, ఈ differences అన్నీ కూడా కేవలం ఉపాధులకే వర్తిస్తాయి. ఎక్కడో ఉన్నాడు అనుకునే సర్వేశ్వరుడు ఇక్కడే ఉన్నాడు, ఇప్పుడే ఉన్నాడు, వాడు మన హృదయంలో ఉన్నాడు, సజీవంగా ఉన్నాడు, మనం నిద్రపోతున్నప్పుడు కూడా ఆయన మెలకువగానే ఉన్నాడు. మన కంట్రోలర్ ఎక్కడో దూరాన లేడు. మన ఇంద్రియాల కంటే, మన శరీరం కంటే, మన మనస్సు కంటే, మన బుద్ధి కంటే, అత్యంత సమీపంలో మన హృదయంలో ఉన్నాడు. అయితే మనకి లోపలకి చూసే అలవాటు తక్కువ, స్మశానానికి

వెళ్ళేవరకు చర్మదృష్టి మనం విడిచి పెట్టలేక పోతున్నాము.

కులం తోటి ఎవడూ చండాలుడు కాదు, చర్మదృష్టి ఉన్న ప్రతీవాడు చండాలుడే. వాడు ఏ కులంలో పుట్టినా చర్మదృష్టి ఉంటే వాడు చండాలుడు అని గుజరాత్‌లో ఒక సెయింట్ చెప్పాడు. మానవుడిని ఎక్కువ రూపం attract చేస్తోంది. ప్రతి మానవుడు ఏదో ఒక రూపం తోటో, నామం తోటో తాదాత్మ్యం చెంది ఉంటాడు. ఇతరులు కూడా అదే అనుకుంటాడు. నామం మనల్ని ఆకర్షిస్తున్నంత కాలం, ప్రకృతి మనల్ని ఆకర్షిస్తున్నంత కాలం, ఈ అలవాట్లు మనల్ని ఆకర్షిస్తున్నంత కాలం, మనస్సు బాహ్యముఖానికి విజృంభిస్తూ ఉంటుంది. మనస్సు బాహ్య ముఖానికి విజృంభిస్తున్నంత కాలం వాసన నాశనం కాదు, వాసనా క్షయం కాదు. భక్తి యోగం అయినా, జ్ఞాన యోగం అయినా, కర్మ యోగం అయినా ఈ యోగాల యొక్క ప్రయోజనం ఏమిటి అంటే, మీ మనస్సు బాహ్యానికి విజృంభిస్తుంటే వాసనా క్షయం కాదు కాబట్టి ఆ మనస్సుని లోపలకి దింపడానికే ఈ యోగాలు. నీ మూలం ఎక్కడో లేదు, నీ మూలం నీ లోపలే ఉంది. నీ మూలం నీ హృదయంలోనే ఉంది. నీ మనస్సుని ఆ హృదయంలోకి అంతర్ముఖం చెయ్యగలిగితే అంటే బాహ్యంగా విజృంభిస్తున్నటువంటి మనస్సుని లోపలకి నువ్వు తిప్పగలిగితే అప్పుడు వాసన స్లోగా reduce అవుతుంది. అంటే వాసనలు క్షయం అవ్వడం ప్రారంభం అవుతాయి. అవి ఒకే రోజున క్షయం అవ్వవు. Day by day, day after day అవి weaken అవుతూ ఉంటాయి.

కొంతమంది ఏమి అంటారు అంటే మేము భక్తి మార్గంలో ఉన్నాం. సాధనలు బాగా చేస్తున్నాం. రోజూ స్నానాలు చేస్తున్నాం, పూజలు చేస్తున్నాం, జపాలు చేస్తున్నాం అని చెబుతూ ఉంటారు. మంచిదే అదంతా సాధనలోకే వస్తుంది. ఎవరో ఇతరులు కొంతమందికి భక్తి లేకపోవచ్చు, సాధన లేకపోవచ్చు. వాళ్ళని చూసి మీరు ఏమనుకుంటారు అంటే వాళ్ళకేమి సాధన లేదు మనం సాధన చేస్తున్నాం అని అనుకుంటారు. ఎప్పుడైతే మీరు అలా అనుకున్నారో దాని వెనకాల మీకు గర్వం ప్రారంభం అవుతుంది. చేసే సాధన ఏమో పది పైసల సాధన, గర్వం ఇరవై పైసలు. అంటే ఇతరుల తోటి పోల్చుకోవడం వల్ల మీరు ప్రమాదంలో పడతారు. ఆధ్యాత్మిక సాధనల పేరు మీద మీకు గర్వం రాకుండా చూసుకోవాలి, అహంభావన రాకుండా చూసుకోవాలి. సాధన చెయ్యడం మంచిదే! సాధన పేరు మీద అహంభావన రాకూడదు. ఆ విషయంలో చాలా మెలకువగా ఉండాలి. సాధన పేరు మీద చైతన్య స్థాయిని పెంచుకునే ప్రయత్నంలో మనం భౌతికమైన పనులు ఏమి neglect చెయ్యవలసిన పని లేదు.

రామకృష్ణ పరమహంస రిపీటెడ్‌గా "పని మనల్ని విడిచిపెట్టాలి కానీ పనిని మనం విడిచి పెట్టకూడదు" అనేవారు. ఒకవేళ మీ దైనందిన జీవితంలో మీరు చేసుకునే పని ఈ భక్తి పేరు మీద కనుక విడిచి పెట్టేస్తే ఏ పని అయితే మీరు విడిచి పెట్టారో రాబోయే జన్మలలో ఆ పనే మీకు ఎదురు అవుతుంది. మీరు ఇష్టంగా పని చెయ్యకపోతే ప్రకృతి బలవంతంగా మీ చేత ఆ పని చేయిస్తుంది. అందుచేత చేసే పని ఎలాగా తప్పదు. అది ప్రీతిగా చేస్తే, ఇష్టంగా చేస్తే, అది నెమ్మదిగా మనల్ని విడిచిపెట్టి వెళ్ళిపోతుంది. భగవంతుడు స్థితప్రజ్ఞుడి లక్షణాలలో రెండు మాటలు చెప్పాడు. ఏమని చెప్పాడు అంటే ఒకటి విధ్వంసక పద్ధతి, రెండు నిర్మాణాత్మక పద్ధతి. నీ మనస్సులో నీకు అక్కర్లేని గొడవలు అన్నీ ఉంటే, పెంట గొడవలు నీ మనస్సులో ఉంటే నెమ్మదిగా బయటకి తోలేయ్. మనం చేలో కలుపు తీస్తాం. అంటే కలుపు మొక్కని లాగి బయట పడేస్తున్నాం. దానిని వేదాంత పరిభాషలో ఏమంటారు అంటే విధ్వంసక పద్ధతి. ఇక్కడ కృష్ణుడు ఏమని చెప్పాడు అంటే హృదయంలో నేను ఉన్నాను. నేను నీకు అనుభవంలోకి రాకుండా ఏ గొడవలు అయితే నీ మనస్సులో ఉన్నాయో వాటిని బయటకి తోలేయ్, అది విధ్వంసక పద్ధతి అని చెప్పాడు. నిర్మాణాత్మకంగా ఇంకొక మాట చెప్పాడు. ఏదైతే ఆత్మ కాదో, ఏదైతే సత్యం కాదో, ఏదైతేపారమార్థికం కాదో, దాని మీద నీ మనస్సు వాలకుండా చూసుకో, అది వైరాగ్యం. తరువాత ఆత్మని పట్టుకోవడానికి నువ్వు చేసే ప్రయత్నం అభ్యాసం. ఇవి రెండు simultaneousగా చేసుకు రమ్మని భగవంతుడు కృష్ణుడు చెప్పాడు.

ఆత్మ గురించి, జ్ఞానం గురించి, చైతన్యం గురించి తప్పించి ఇతర విషయాలు రమణమహర్షి గారి దగ్గర ఏది తలపెట్టినా, you go and sit down అనేవారు. రమణమహర్షి గారు సబ్జెక్టు విడిచిపెట్టడం అనే సమస్య లేదు. మీకు నచ్చవచ్చు, నచ్చకపోవచ్చు. ఎవరైనా సబ్జెక్టుని విడిచిపెట్టి కనుక మాట్లాడుతుంటే వాడు ఎంతటివాడు అయినా సరే, సమాజంలో వాడు ఎటువంటి స్టేటస్‌లో ఉన్నా you go and sit down, నువ్వు వెళ్లి అక్కడ కూర్చో అనేవారు. సబ్జెక్టుని విడిచిపెట్టి మాట్లాడితే మటుకు ఆయన ఎప్పుడూ క్షమించేవారు కాదు. అయితే సబ్జెక్టు మీద concentrate చేసి మాట్లాడితే repeatedగా ప్రశ్నలు అడిగినా ఆయన దానికి reply ఇచ్చేవారు. మనం ఆలోచన విడిచి పెట్టకూడదు, ఆలోచన కూడా మనల్ని అమృతస్థితికి తీసుకుపోతుంది. అంటే ఆలోచన కూడా తపస్సు తోటి సమానం. ఆలోచన మంచిదే మీకు, మీకున్న వివేకం మంచిదే, మీకున్న తెలివి మంచిదే, అయితే మీలో ఉన్న సత్యవస్తువును దర్శించడానికి మీ తెలివిని ఉపయోగించుకోవాలి, మీ ఆలోచనని ఉపయోగించుకోవాలి, లోతులకి దిగాలి. చైతన్యం అన్నా, జ్ఞానం అన్నా, బ్రహ్మం అన్నా, ఆత్మ అన్నా ఇవన్నీ పర్యాయ పదాలు.

నీ హృదయంలో ఉంది చైతన్యం. అందులోకి నువ్వు దిగలేకపోతున్నావు. దిగడానికి నీకు బరువు సరిపోవటం లేదు, తూకం సరిపోవటం లేదు. అయ్యో నాకు దిగే శక్తి లేదు అని నువ్వు అనుకోవటం లేదు. ఆ లోతుల్లోకి వెళ్ళలేక, ఆ depthని నువ్వు టచ్ చెయ్యలేక నువ్వు వస్తువే లేదు అనుకుంటున్నావు. కానీ నీకు వైరాగ్యం వల్లే తూకం వస్తుంది, బరువు వస్తుంది. దాని వలన నీ హృదయంలోకి నువ్వు మునగాలి.

"నాకు ఈ లోకంలో పని చేసి సంపాదించవలసింది ఏమీ లేదు" ఇది కృష్ణుడు చెప్పిన మాట. అయినప్పటికీ నేను పని చేస్తూనే ఉన్నాను. కారణం ఏమిటి అంటే ఇతరులు చెడిపోకుండా ఉండడం కోసం, కృష్ణుడే పని మానేశాడు నేను ఎందుకు చెయ్యాలి అని అనుకుంటారు అని, ఇతరుల కోసం ఒక ideal కోసం నేను పని చేస్తున్నాను. అయితే పని చేసి సంపాదించవలసింది నాకు ఏమీ లేదు. కానీ చైతన్యానుభవం లేని వాళ్ళు కూడా పని మానేస్తారేమో అనే ఉద్దేశ్యంతో నేను పని చేస్తూనే ఉన్నాను. అంటే కర్మని విడిచి పెట్టటం కాదు, కర్మ ఫలాన్ని విడిచి పెట్టటం మంచిది అని భగవద్గీత పొడవునా వాసుదేవ స్వామి చెబుతూ వచ్చాడు. నేను అప్పుడప్పుడు భగవద్గీతని చదువుతున్నాను అని ఒక భక్తుడు భగవాన్‌తో అంటే రమణమహర్షి గారు అంటున్నారు "అప్పుడప్పుడు చదువుతాను అంటున్నావు అలా కాదు ఎప్పుడూ చదువు" అన్నారు. ఎప్పుడూ చదువుతుంటే అందులో ఉన్న లోతులు ఎప్పుడో ఒకసారి నీకు స్ఫురిస్తాయి. ఈశ్వరానుగ్రహం లేకపోతే ఈశ్వరుడి మాటకి అసలు మనకి అర్థమే తెలియదు. జ్ఞాని ఒక మాట మాట్లాడితే ఆయన అనుగ్రహం లేకుండా ఆయన వాక్యం కూడా మనకి అనుభవంలోకి రాదు. అర్థమే కాదు అసలు. మనకి sincerity ఉంటే, కాల ప్రవాహంలో, ఆ పరిణామంలో మనకి అది అర్థం అవుతుంది, అనుభవంలోకి కూడా వస్తుంది. ఏమి తొందర పడక్కర్లేదు. ఎప్పుడో కాదు, ఎక్కడో కాదు, ఇప్పుడే, ఇక్కడే, అది మనకి అర్థం అవుతుంది, అనుభవంలోకి వస్తుంది.

జీవుడికి అసాధ్యం ఉంది కానీ భగవంతుడికి అసాధ్యం అంటూ ఏమీ లేదు. నిన్ను



**కట్టెలు ఏ విధంగా అయితే శరీరాన్ని కాల్చి బూడిద చేస్తాయో, నేను ఎవడను అనే విచారణ దేహము నేను అనే తలంపును కాల్చి బూడిద చేస్తుంది.**

అనుగ్రహించడానికి కొన్ని క్షణాలు చాలు. భగవంతుడు నిన్ను అనుగ్రహించాలి అనుకొంటే ఎవరూ అడ్డుకోలేరు. భగవంతుడి డిక్షనరీలో ఆయనకి అసాధ్యం అంటూ ఏమీ లేదు. భగవద్గీత మనం చదివే కొలది ఒకొక్క టైములో ఒకొక్క అర్థం స్ఫురిస్తూ ఉంటుంది. భగవద్గీతలో చెప్పకుండా విడిచిపెట్టిన విషయం లేదు. అంటే ఏ జ్ఞాని చెప్పినా, ఏమహర్షి చెప్పినా, ఏ మహాత్ముడు చెప్పినా, వాళ్ళు చెప్పిన మాట భగవద్గీతలో ఏడు వందల శ్లోకాలలో ఏదో ఒక శ్లోకాన్ని అతుక్కుని ఉంటుంది. గీతలో సమస్త విషయాలు చెప్పాడు. ఒకొక్క మైండ్ మేకప్ ఒకొక్క రకంగా ఉంటుంది. ఒకొక్క మనిషి యొక్క ప్రవృత్తి ఒకొక్క రకంగా ఉంటుంది. అందరి ప్రవృత్తులకి అనుగుణంగా పరమాత్మ చెప్పాడు. అంటే ఏడు వందల శ్లోకాలలో నీ మానసికప్రవృత్తికి కనీసం ఒక్క శ్లోకం అయినా నచ్చుతుంది. మీకు ఏదైనా సందేహాలు ఉంటే ఏడు వందల శ్లోకాలలో ఒక్క శ్లోకం అయినా మీసందేహాన్ని నివారణ చేస్తోంది. అందుచేత భగవద్గీతని మీరు అనుదినం చదవండి.

రమణమహర్షి గారు అంటున్నారు ఒక జ్ఞాని ప్రభావం, ఒకమహర్షి ప్రభావం, ఒక మహాత్ముడి ప్రభావం, నిశ్శబ్దంగా భక్తుడి హృదయంలోకి రహస్యంగా చొరబడుతుంది. జ్ఞాని ఎవడూ కూడా గడబిడ చెయ్యడు. ఎవడికైతే జ్ఞాని సహాయం చేస్తున్నాడో, వాడు జ్ఞాని ద్వారా సహాయం పొందుతున్నాడు అన్న సంగతి వాడికే తెలియనివ్వడు, వాడు జ్ఞాని. అంత నిశ్శబ్ధంగా పని చేస్తాడు. భక్తుడి హృదయంలోకి రహస్యంగా చొరబడతాడు. వాడి హృదయంలో చొరబడినట్టు వాడికే తెలియదు. వాడిని purify చేస్తున్నట్టు వాడికే తెలియదు. ఆ purification అంతరాళాల్లోంచి వస్తుంది. రమణమహర్షి గారు అనేవారు జ్ఞానం అనేది పైనుంచి పోసేది కాదు లోపల నుంచి ఊరేది. అంటే వస్తువు నీకు అనుభవంలో ఉండాలి. మీ మనస్సు ఏ విధంగా అయితే మీకు అనుభవంలో ఉందో, మీ వికారాలు ఏ విధంగా అయితే అనుభవంలో ఉన్నాయో, మీ ప్రకృతి గుణాలు ఏ విధంగా అయితే మీకు అనుభవంలో ఉన్నాయో, మీ శరీరం ఏ విధంగా అయితే ఇప్పుడు మీకు అనుభవంలో ఉందో, లోపల ఉన్న సత్యవస్తువు అలా మీకు అనుభవంలోనికి రావాలి. అది జ్ఞానం. మీకు ఇప్పుడు మనస్సు నేనుగా వ్యక్తం అవుతుంది. దాని ప్లేస్ లో తత్త్వం కనుక మీకునేనుగా వ్యక్తం అవుతుంటే అది జ్ఞానం. అంటే మనస్సుకి పరిమితులు ఉన్నాయి. ఈ false "I" కి, ఈ individual "I" కి, ఈ bodybound "I" కి, పరిమితులు ఉన్నాయి. ఆ real "I" కి మటుకి పరిమితులు లేవు.

ప్రతీ మనిషి తన వ్యక్తిత్వాన్ని పెంచుకోవడానికే మాట్లాడుతూ ఉంటాడు, పనిచేస్తూ ఉంటాడు. ఆ individual "I" కి మేత ఉండాలి ప్రతీవాడికి. ఆ individual "I" కి మేత

వెయ్యడానికి సమాజంలో తిరుగుతూ ఉంటాడు. individual "I" కోసం జీవితం అంతా పాడుచేసుకుంటున్నావు. ఎన్ని జీవితాలు నువ్వు ఇలా పాడుచేసుకుంటావు? గాఢనిద్రలో నీ individual "I" ఏమైంది అన్నారు రమణమహర్షి. నువ్వు బ్రతికేదే ఆ individual "I" కోసం బ్రతుకుతున్నావు. ఏ individual "I" కోసం అయితే నువ్వు జీవిస్తున్నావో, గాఢనిద్రలో ఆ individual "I" ఏమవుతోంది? అది అడ్రస్ లేకుండా పోతుంది. ఆ individual "I" కనుక నిజం అయితే, ఆ bodybound "I" కనుక నిజం అయితే, ఆ mother thought కనుక నిజం అయితే, గాఢనిద్రలో కూడా అది బయటకి పోవడానికి వీలు లేదు. ఏదైతే నువ్వు కాదో వాటి అన్నిటి లోంచి గాఢనిద్రలో నువ్వు విడిపోతున్నావు. నీ దేవుడి తోటి, నీ ప్రపంచం తోటి, నీ sex తోటి, నీ శరీరం తోటి, నీ చుట్టాలు తోటి, నీ family members తోటి, నువ్వు ప్రేమిస్తున్న ఈ ప్రపంచం తోటి, ఈ దృశ్యాల తోటి నువ్వు విడిపోతావు. మనకి ఇష్టం ఉన్నా, మనకి ఇష్టం లేకపోయినా మనం కాని దాని తోటి ఏదో ఒక రోజున వియోగం మనకి తప్పదు. ఏదో ఒకరోజు separate అవ్వాలి. ఇష్టం ఉన్నా తప్పదు, ఇష్టం లేకపోయినా తప్పదు. రోజూ గాఢనిద్రలో నువ్వు కాని దానితోటి నువ్వు సెపరేట్ అయిపోతున్నావు. వీటి తోటి సెపరేట్ అయిపోయినప్పటికీ నువ్వు అక్కడ ఉంటున్నావు. గాఢనిద్రలో నేను లేనని ఎవడూ చెప్పడు. ఆ గాఢనిద్రలో ఎవడైతే ఉన్నాడో, జాగ్రదావస్థలో కూడా వాడు ఉన్నాడు. వాడు ఎక్కడికి పారిపోలేదు. వాడిని అనుభవంలోకి తెచ్చుకోవటమే జ్ఞానం.

సత్పురుషుల తోటి, మహాత్ముల తోటి, సహవాసం మంచిది. దానివల్ల కూడా మీకు తెలియకుండా సాధన జరిగిపోతూ ఉంటుంది. మీరు చేసుకునే పూజ, మీరు చేసుకునే జపం, మీరు చేసుకునే ధ్యానాలు handfans లాంటివి. Handfan అంటే విసినకర్ర. మాములుగా విసినకర్రతో కూడా ఇలా గాలి విసురుకోవచ్చు, మహా ప్రవాహంలాగ గాలి వస్తోంది అనుకోండి, ఆ గాలి వచ్చినప్పుడు handfan అక్కర్లేదు. మీకు అర్థం అవుతోందా? అదే విధంగా మహర్షుల తోటి సాంగత్యం, మహాత్ముల తోటి సాంగత్యం, సత్పురుషుల తోటి సాంగత్యం ఎటువంటిది అంటే అది మహాప్రవాహం. అది సాధన కాదు అనుకోకు నువ్వు, సాధనలో ఒక భాగమే. నీ స్వరూప సాక్షాత్కారానికి వాళ్ళు నిన్ను మోసుకుని పోతారు. మహర్షులు, మహాత్ములు, జ్ఞానులు కూడా నీకు తెలియకుండానే నీ స్వరూప సాక్షాత్కారానికి, నీ హృదయం యొక్క లోయలలోకి, ఎక్కడైతే దేవుడు ఉన్నాడో, అక్కడకి నీకు తెలియకుండానే నిన్ను మోసుకుపోతారు. నిజమైన మహర్షి ఎక్కడ ఉన్నాడు? నీ హృదయంలోనే ఉన్నాడు. వాడు ఎక్కడ ఉన్నాడో అక్కడకి నిన్ను మోసుకుని పోతాడు. అది నీకు తెలియకుండానే జరిగిపోతూ ఉంటుంది అని కూడా భగవాన్ చెబుతారు.

అందుచేతమహర్షికి, మహర్షికి భేదం చూడనక్కర్లేదు. మహాత్ముడికి, మహాత్ముడికి భేదం చూడనక్కర్లేదు. జ్ఞానికి, జ్ఞానికి భేదం చూడనక్కర్లేదు. ఈ ప్రకృతి గుణాలు దాటిన తరువాత ఎవరైనా ఒక్కటే!

ఈ ప్రపంచంలో నిజమైన సుఖి ఎవడు అంటే జ్ఞాని మాత్రమే. జ్ఞానం వచ్చేవరకు సాధన దశలో ఎంతో కొంత మనకిపచ్చి తప్పదు . పచ్చి వాసన వస్తూనే ఉంటుంది. ఎవడికైతే బ్రహ్మానుభవం కలిగిందో వాడిని ఆ పచ్చి వాసన విడిచి పెట్టేస్తుంది. బ్రహ్మానుభవం పొందినవాడు మాట్లాడినా, కూర్చున్నా, నుంచున్నా, ఏది చేసినా అక్కడ నుంచి శాంతి తరంగాలు ప్రవహిస్తూ ఉంటాయి. కొంతమంది చెబుతూ ఉంటారు. చెడ్డవాడి తోటి స్నేహం కంటే మంచివాడి తోటి విరోధం మంచిది అని. మీకు అర్థం అవుతోందా? అంటే దాని అర్థం ఏమిటి? మంచి వాడి తోటి విరోధం ఉంటే వాడు ఎప్పుడైనా మనకి జ్ఞాపకం వస్తాడు అనుకోండి, అప్పుడుమనకి మంచే జరుగుతూ ఉంటుంది. అంటే మంచితనంలో ఉన్న గొప్పతనం అది. అంటే కంసుడు అలాగే బాగు పడ్డాడు కదా మరి కృష్ణుడు తోటి విరోధం పెట్టుకుని. చెడ్డవాడి తోటి స్నేహం కంటే మంచి వాడి తోటి విరోధం మంచిది. అంటే వాడు ఏ రకంగా జ్ఞాపకం వచ్చినా మనకి మంచే జరుగుతుంది. అది మీరు అర్థం చేసుకోవాల్సింది.మహర్షికి,మహర్షికి భేదం చూడకండి. జ్ఞానికి, జ్ఞానికి భేదం చూడనక్కర్లేదు. మహాత్ముడికి, మహాత్ముడికి భేదం చూడనక్కర్లేదు. వారి సాంగత్యం మంచిది అంటున్నారు భగవాన్.

మంచి చేసిన వాడికి దుర్గతి లేదు అన్నాడు పరమాత్మ. తగినటువంటి ఫలం తోటి వాడిని అనుగ్రహిస్తాడు. మంచి చేసి మీరు మర్చిపోవచ్చు కానీ ఎప్పుడో ఒకప్పుడు మీకు ఆ ఫలితం ఇచ్చి తీరతాడు భగవంతుడు. మీరేమీ అడగక్కర్లేదు ప్రత్యేకంగా. రమణమహర్షి గారు చెబుతూ ఉండేవారు. దేవుడు అడిగినవాడికి అడిగినదే ఇస్తాడు. అడగని వాడికి అన్నీ ఇస్తాడు అని. అడగని వాళ్లకి అన్నీ ఇస్తాడు. మాకు భక్తి ప్రసాదించండి, జ్ఞానం ప్రసాదించండి, వైరాగ్యం ప్రసాదించండి అని చాలామంది దేవుడిని అడుగుతూ ఉంటారు. అడగడం మంచిదే, అలా అడగవచ్చు. రమణమహర్షి గారు అది కూడా అడగలేదు. ఓ అరుణాచలేశ్వరుడా, నువ్వు రమ్మంటే నేను వచ్చాను అన్నాడు. నాకు జ్ఞానం ప్రసాదించు అని ఆయన అడగక్కరలేదు అంతకు ముందే ఆయన జ్ఞాని అయ్యి ఉన్నాడు. అందుచేత ప్రత్యేకంగా ఏమి అడుగుతాడు? ఏ వస్తువు పొందడం కోసం మానవజాతి ప్రయత్నం చేస్తుందో, ఏ వస్తువు పొందడం కోసం మానవ జాతి అంతా సాధన చేస్తుందో, అప్పటికే ఆ వస్తువు అయ్యి ఉన్నాడు, అందుచేత అడగవలసినటువంటి పని లేదు. లోకానికి

సంబంధించిన కోరికలు దేవుడిని అడిగితే తప్పేమీ కాదు. దేవుడు కూడా మన తండ్రి లాంటి వాడే, అడిగితే తప్పు కాదు కానీ అడగకుండా ఉంటే మంచిది అన్నారు భగవాన్. అడిగిన వాడికి అడిగినదే ఇస్తాడు. అడగని వాడికి అన్నీ ఇస్తాడు. ఎందుచేత? నీకు ఏది ఎప్పుడు ఎక్కడ ఎందుకు కావాలో అది ఇస్తూ ఉంటాడు. ఒకొక్కసారి నీకు అనుకున్న దానికంటే ఎక్కువ ఇస్తాడు అనుకో, దానివల్ల నువ్వు పాడైపోవచ్చు, ఒకొక్కసారి నీ కోరిక నెరవేర్చడు. నీ కోరిక నెరవేర్చితే ఒకవేళ నువ్వు పాడయ్యే ప్రమాదం ఉండవచ్చు. ఆ ఫలితం వస్తే దానిని అనుభవించడానికి, దానిని ఇముడ్చుకోవడానికి, తగిన యోగ్యత కానీ, అర్హత కానీ నీకు లేకపోవచ్చు. అందుచేత నువ్వు ప్రార్థిస్తున్నప్పటికీ దాని ఫలితం ఒకొక్కసారి pendingలో పెట్టి ఉంచుతాడు. నువ్వు యోగ్యత సంపాదించాక, నువ్వు అర్హత సంపాదించాక, నువ్వు deserve అయ్యాక నిన్ను అప్పుడు ఆ ఫలితం తోటి అనుగ్రహిస్తాడు. మీరేమితొందర పడవద్దు. అదే కృష్ణుడు తరచుగా చెబుతాడు. Wait చేస్తే నీకు growth వస్తుంది, తొందరపడకు. కొంత Waiting అవసరం, తరువాత నెమ్మదిగా నీకు growth కూడా వస్తుంది. నువ్వు తొందర పడకు. నెమ్మది నెమ్మదిగా సాధన చెయ్యి. జన్మాంతరాల నుంచి నీకు వచ్చిన ఈ సంస్కారాలు, ఈ tendencies, ఇవన్నీ ఒక్క రోజులో పోవు. స్లోగా reduce చేసుకుంటూ రావాలి. కంగారు పడితే మానసిక అనారోగ్యం వస్తుంది. అందుచేత నువ్వు స్లోగా reduce చేసుకుంటూ రావాలి, balancedగా reduce చేసుకుని రావాలి, జాగ్రత్తగా రావాలి, కంగారు పడక్కర్లేదు. అది ఈశ్వరుడు చూస్తూ ఉంటాడు, గురువు చూస్తూ ఉ ంటాడు. గురువు అంటే ఎవరో అనుకోకు, ఆత్మ అంటే ఎవరో అనుకోకు, దేవుడు అంటే ఎవరో అనుకోకు, నీ హృదయంలోని సద్వస్తువే నిన్ను అనుగ్రహించడం కోసం, బయట గురురూపంలో, మహాత్ముడి రూపంలో, మహర్షుల రూపంలో వ్యక్తం అవుతున్నాడు.

అంతా వాసుదేవ స్వరూపమే అంటారు కొంతమంది, అంతా వాసుదేవ స్వరూపం అనేటప్పుడు మనం కూడా వాసుదేవ స్వరూపం అన్న సంగతి వీడు మర్చిపోతూ ఉంటాడు. మళ్ళీ నేను వేరు, వాసుదేవ స్వరూపం వేరు అనుకుంటూ ఉంటాడు. అంతా వాసుదేవ స్వరూపం అంటే వీడు కూడా వాసుదేవుడే. ఎవడు? ఈ చెప్పేవాడు కూడా వాసుదేవుడే. మళ్ళీ తాను వేరు కాదు అక్కడ. అంతా అంటే వీడు కూడా ఉన్నాడు. అది గ్రహించాలి. అంతా వాసుదేవ స్వరూపం అని మళ్ళీ తనని నిందించుకోకూడదు అక్కడ. నువ్వేమి భేదం చూడనక్కర్లేదు. మహర్షికి–మహర్షికి, జ్ఞానికి–జ్ఞానికి, మహాత్ముడికి–మహాత్ముడికి మధ్య నువ్వు భేదం చూడవలసిన పనిలేదు. వారి సాంగత్యం మంచిది. వాళ్ళు చేసే పని కూడా సైలెన్స్ గా చేసేస్తారు. వాళ్ళ మాటల తోటి పనిలేదు. వాళ్ళు మాట కూడా చెప్పకుండా

నీకు జ్ఞానాన్ని బోధిస్తారు. వాళ్ళ మౌనం కూడా నీకు జ్ఞానం బోధిస్తుంది. ఎంత గొప్ప స్థితో చూడండి. మాట తోటి పని లేకుండా, చూపు తోటి పని లేకుండా, స్పర్శ తోటి పని లేకుండా, ఒక లుక్ తోటి పని లేకుండా కేవలం సైలెన్స్ తో వాడు ఇవ్వవలసిందిఏదో ఇచ్చేస్తాడు వాడు మహాత్ముడు. ఆ మౌనం లోంచి వచ్చే సందేశం నువ్వు అందుకోలేనప్పుడు, దానికి నీకు అర్హత లేనప్పుడు మటుకే మాట చెబుతాడు. జ్ఞాని మౌనం అనుగ్రహం. జ్ఞాని మాట కూడా అనుగ్రహం. అది శబ్దం కాదు. అది అనుగ్రహమే. ఒక జ్ఞాని నోటి వెంట వచ్చింది శబ్దం అనుకోకండి, ఒక మాట అనుకోకండి, అది కూడా grace. వాళ్ళ grace మౌనం ద్వారా వస్తుంటే, నీ బ్రెయిన్ అందుకోలేనప్పుడు వాళ్ళ అనుగ్రహాన్ని మాట తోటి వ్యక్తం చేస్తున్నారు, అంతేకానీ మాట కాదు అది. జ్ఞాని ఒక మాట మాట్లాడితే, అది ప్రపంచం యావత్తు జాతి మీద కూడా పని చేస్తోంది. స్లోగా పనిచేయవచ్చు కానీ అది తప్పనిసరిగా పనిచేస్తూనే ఉంటుంది. జ్ఞాని యొక్క చూపు, జ్ఞాని యొక్క మాట, జ్ఞాని యొక్క నడక, అదంతా కూడా సమాజం మీద పనిచేస్తూనే ఉంటుంది.

జ్ఞానికి శిష్యులు ఉంటారు, జ్ఞానికి భక్తులు ఉంటారు, జ్ఞాని అంటే ఇష్టంలేని వారు కూడా ఉంటారు. రమణమహర్షి గారు చెప్పేది ఎవరికైనా అర్థం కావటం లేదు అనుకోండి, అప్పుడు ఆయన చెబుతూ ఉంటారు కొంతమంది కళ్లు ఉండి చూడలేరు. చెవులు ఉండి వినలేరు అనేవారు. అంటే ఎదురుగుండా ఉన్న మనిషి ఎవరో వీడికి అర్థం కావటం లేదు. కొంతమంది కళ్లు ఉండి కూడా చూడలేరు, చెవులు ఉండి కూడా వినలేరు. అర్హత లేనప్పుడు, యోగ్యత లేనప్పుడు సర్వేశ్వరుడు వచ్చి మన పక్కన కూర్చున్నా మనం గుర్తించలేము. మనకి అర్హత లేనప్పుడు, మనకి యోగ్యత లేనప్పుడు శ్రీ కృష్ణుడు వచ్చి మన దగ్గర కూర్చున్నప్పటికీ వాడిని శ్రీ కృష్ణుడు అనుకోము, ఎవడో అనుకుంటాం, అంటే మనకి గుర్తించే శక్తి లేక! పరమేశ్వరుడు వచ్చి మన పక్కన కూర్చున్నప్పటికీ మనకి ఎంతైతే అర్హత ఉందో, మనకి ఎంతైతే యోగ్యత ఉందో, అంతవరకే మనకి దక్కుతుంది. సముద్రంలో ఎన్ని నీళ్ళు ఉన్నా మనం చెంబు పట్టుకుని వెళితే ఆ చెంబు నీళ్ళే తెచ్చుకోగలం, ఒక బిందె

**మంచి విషయాలను శ్రవణం చేయటం వలన**
**వివేకం పెరుగుతుంది, బుద్ధి బలం**
**పెరుగుతుంది.**



పట్టుకుని వెళితే, ఆ బిందె నీళ్ళే తెచ్చుకోగలం. అదే విధంగా పరమేశ్వరుడు దగ్గర మన అర్హతని బట్టే మనం పొందగలం కానీ పరమేశ్వరుడు దగ్గర కూర్చున్నప్పటికీ మన అర్హతకి మించి, యోగ్యతకి మించి మనం పొందలేము.

చైతన్యస్థాయి ఒకడికి ఎక్కువగా ఉంది అనుకోండి, ఒకడికి తక్కువగా ఉంది అనుకోండి, ఎక్కువ చైతన్యస్థాయిలో ఉన్నవాడు చెప్పిన మాట తక్కువ చైతన్యస్థాయిలో ఉన్నవాడికి అర్థం కాదు. అందుచేత అర్థం చేసుకోవడం కూడా ఒక యోగం తోటి సమానం. సబ్జెక్టు అర్థం చేసుకోవడం కూడా ఒక యోగం తోటి సమానం. సబ్జెక్టు నీకు ప్రోపర్‌గా అర్థం అవుతుంటే, detailedగా నీకు సబ్జెక్టు అర్థం అవుతుంటే, తప్పనిసరిగా నీకు ఆచరించాలి అనే బుద్ధి కలుగుతుంది. సబ్జెక్టు అర్థం కావడం లేదు అనుకోండి confusion వచ్చేస్తుంది. మీకు ఆచరించాలి అనే బుద్ధి కూడా కలగదు. అరచేతిలో ఉన్న వస్తువు నీ కళ్లకి ఎంత స్పష్టంగా కనిపిస్తుందో, సబ్జెక్టు నీకు అంత బాగా అర్థం అవ్వాలి. అర్థం అవుతుంటే నీకు ఆచరించాలి అనే బుద్ధి పుడుతుంది. ఆచరిస్తే అనుభవంలోకి వస్తుంది. అప్పుడు మీరు ఏమవుతారు? మీరు దేవుడి స్వరూపం పొందుతారు. ఎవడైతే జీవన్ముక్తుడో, ఎవడైతే జ్ఞానో, ఎవడైతే మహా గురువో, వాడి మీద మీకు విశ్వాసం ఉండాలి, ఎవడైతే విశ్వాసం ఉంచాడో వాడు ముక్తి పొందుతాడు. ఇది మీరు బాగా అర్థం చేసుకోండి. Faith ఉంటే చాలు అక్కడ, faith ఉంటే అది లాక్కుని వెళ్ళిపోతుంది. ఇంజను తోటి పెట్టెకి కనెక్షన్ ఇస్తే చాలు తరువాత ఇంజనే లాక్కుని వెళ్ళిపోతుంది. అలా faith కనెక్షన్ ఇస్తుంది.

కొంతమంది మనుషులు ఎలా ఉంటారు అంటే వాళ్ళు ఏమి ఉపకారం చెయ్యకపోయినా, మీ వల్లే మాకు ఉపకారం జరిగింది అంటే, నిజమే అంటారు. వాళ్ళ వల్ల నిజంగా మనకి ఉపకారం జరగకపోయినా మీరే మాకు ఉపకారం చేశారు అంటే అబ్బే మేము చెయ్యలేదు అనరు వాళ్ళు చెయ్యకపోయినా, నిజమే మేమే చేశాం అంటారు. జ్ఞాని ద్వారా సహాయం మనకి అందుతూ ఉంటుంది. కానీ మన గుర్తింపు వాడు కోరడు, అహంకారి గుర్తింపు కోరతాడు. అహంకారికి ఇతరులు ఉన్నారు, జ్ఞానికి ఇతరులు లేరు. రమణమహర్షి ఎంత Impersonalగా ఉంటారో ఒక ఉదాహరణ చెబుతాను. మీరు ఇక్కడ ఉన్నారు అని మేము అరుణాచలం వచ్చాం. ఈ అరుణాచలం తోటి మాకు సంబంధం ఏమిటి? రమణాచలం తోటి మాకు సంబంధం ఏమిటి? జ్ఞానాచలం తోటి మాకు సంబంధం ఏమిటి? మీరు ఉన్నారనే మేము వచ్చాం అన్నాడు ఒక భక్తుడు. అలా మనలని ఎవరైనా అన్నారు అనుకోండి మనం సంతోషిస్తాం. మీకు అర్థం అవుతోందా? కానీ భగవాన్ ఏమన్నారు అంటే మరి నేను ఎవరిని బట్టి వచ్చాను? మీరు అందరూ నన్ను

బట్టి వచ్చారు అంటున్నారు. మరి నేను ఎవరిని బట్టి వచ్చాను? నన్ను ఏ దేవుడు అయితే తీసుకుని వచ్చాడో, ఆ దేవుడే మిమ్మల్ని కూడా తీసుకుని వచ్చాడు. నన్ను తీసుకొచ్చిన దేవుడు, మిమ్మల్ని తీసుకొచ్చిన దేవుడు వేరు కాదు. నన్ను ఏ దేవుడైతే తీసుకుని వచ్చాడో, ఆ దేవుడే మిమ్మల్ని తీసుకుని వచ్చాడు. ఏ దేవుడైతే నన్ను అనుగ్రహించాడో, ఆ దేవుడే మిమ్మల్ని అనుగ్రహిస్తాడు అన్నారు. అది impersonalగా మాట్లాడడం అంటే, జ్ఞాని మాట్లాడుతుంటే జ్ఞాని సమక్షంలో ఉన్న వాళ్ళే బాగుపడడం కాదు. లోకం అంతా బాగు పడతారు. జ్ఞాని ఒక మాట మాట్లాడితే ఆ మాట ఊర్లు దాటుతుంది, నదులు దాటుతుంది, దేశాలు దాటుతుంది, సముద్రాలు దాటుతుంది, జ్ఞాని నోటి వెంట వచ్చిన మాట ప్రపంచం అంతా వ్యాపిస్తుంది. అత్యంత శక్తివంతంగా వ్యాపిస్తుంది. జ్ఞాని దేహం ఉన్నా, లేకపోయినా, జ్ఞానిని మీరంతా అణిచివేద్దాం అని చూసినా, జ్ఞాని నోటి వెంట వచ్చిన మాట బోదులు, కాలువలు, నదులు, సముద్రాలు దాటి ప్రపంచం అంతా మారు మోగుతుంది. జ్ఞాని యొక్క మాట అటువంటిది. ఎంతకాలం అయితే నదులు ప్రవహిస్తూ ఉంటాయో, ఎంతకాలం అయితే కొండలు ఉంటాయో, సూర్య చంద్రులు ఎంతకాలం ఉంటారో, జ్ఞాని యొక్క మాట కూడా అంత సజీవంగా ఉంటుంది. జ్ఞాని యొక్క నాలుక హృదయంలో ఉంటుంది. జ్ఞాని యొక్క మాట హృదయ సారం, అది అహంకార సారం కాదు. యేసు అన్నాడు కొండమీద దీపం పెట్టి ఎవరికీ కనపడకూడదు అంటే ఎలా కుదురుతుంది? అదే విధంగా జ్ఞాని యొక్క మాట ఎవరికీ వినపడకూడదు అంటే ఎలా కుదురుతుంది? జ్ఞాని మాట ప్రపంచం అంతా వ్యాపిస్తుంది, నదులు దాటుతుంది. సముద్రాలు కూడా దాటి ఇతర ఖండాలలో మారు మోగుతుంది.

గురువుని పూజించే భక్తుడు పుణ్యం సంపాదిస్తాడు. అంటే గురువుని మీరు పూజిస్తున్నారు అనుకోండి ఆ పూజ ఎవరికి వర్తిస్తుంది? ఈశ్వరుడికే వర్తిస్తుంది. ఒక జ్ఞానికి నమస్కారం పెడితే, జ్ఞానిని కనుక మీరు పూజిస్తే, ఆ పూజలు, ఆ నమస్కారాలు ఎవరికి అందుతాయి? ఈశ్వరుడికి మాత్రమే అందుతాయి. ఎందుచేత? జ్ఞాని ఈశ్వరుడి యొక్క స్వరూపం అయ్యి ఉన్నాడు కాబట్టి, అవన్నీ కూడా ఈశ్వరుడికి అందుతాయి. జ్ఞానిని ఆరాధించడం వల్ల, జీవన్ముక్తుడిని ఆరాధించడం వలన, గురువుని గౌరవించడం వల్ల వాడు పుణ్యం సంపాదించుకుంటాడు. ఎవడైతే జ్ఞానిని చూస్తున్నాడో ఆ స్థాయికి మనం కూడా ఎదగాలి అనే కాంక్ష వీడికి కూడా వస్తుంది. ఒక జ్ఞానిని దర్శిస్తే, ఒక మహాత్ముడిని దర్శిస్తే, ఒకమహర్షిని దర్శిస్తే, ఒక realized soulని దర్శిస్తే మీరు వట్టి చేతుల తోటి బయటకి వెళ్లరు. నాస్తికుడు ఆస్తికుడు అవుతాడు, ఆస్తికుడు భక్తుడు అవుతాడు, భక్తుడు జ్ఞాని

అవుతాడు. కేవలం వారిని దర్శించినంత మాత్రం చేతనే ఎంతోకొంత మీరు evolve అవుతారు. రమణమహర్షి లాంటి వాళ్ళు మనతోటి వాదించడానికి కానీ, మనతోటి తర్కించడానికి కానీ, మనకి ఉపన్యాసాలు చెప్పడానికి కానీ వాళ్ళు ఈ భూమి మీదకి రాలేదు. భూమి మీదకి వాళ్ళు జ్ఞానం పంచి పెట్టడానికి వచ్చారు. కేవలం జ్ఞానాన్ని మనకి పంచి పెట్టటం కోసమే, మనం మరచిపోయిన సత్యాన్ని మన స్మృతికి తీసుకు రావటం కోసమే ఆ దివి నుండి ఈ భూమికి దిగి వచ్చారు. మహాత్ముల దర్శనం చెయ్యడం వల్ల మనం ఊరికే పోము. ఒక పిల్లవాడు బాగా చదువుకున్న పిల్లవాడి దగ్గరకు వెళతాడు అనుకోండి వాడికి మల్లే మనం కూడా బాగా చదువుకోవాలి అనుకుంటాడు. మొద్దు అబ్బాయి దగ్గరకు వెళతాడు అనుకోండి ఉన్న చదువు ఊడిపోతుంది. అందుచేత మహాత్ముల దర్శనం చెయ్యడం వల్ల మనం కూడా ఆ అంతస్తు పొందాలి అనే సంకల్పం మీకు కలుగుతుంది. అందుచేత వాళ్ళ దర్శనం ఊరికే పోదు. ఒకవేళ నీలో ఏదైనా దోషం ఉంది అనుకో, నీలో ఏదైనా పాపం ఉంది అనుకో, నీలో ఏదైనా బలహీనత ఉంది అనుకో, నీలో ఎన్ని దోషాలు ఉన్నా, ఎన్ని ద్వేషాలు ఉన్నా, ఎన్ని పాపాలు ఉన్నా, ఎన్ని బలహీనతలు ఉన్నప్పటికీ జ్ఞాని దర్శనం వల్ల అవి నెమ్మదిగా ఒకొక్కటి ఒకొక్కటి weaken అయిపోయి రాలిపోతాయి.

జ్ఞాని యొక్క దర్శనం ఎంత బలీయంగా ఉంటుంది అంటే, రమణమహర్షి గారు భిక్ష చేసుకున్నప్పుడు ఒకరి ఇంటికి వెళ్ళారు. వెళితే వాళ్ళు పేకాట ఆడుకుంటున్నారు. రమణమహర్షి గారిని వెళ్ళవయ్యా, వెళ్ళవయ్యా అంటున్నారు వాళ్ళు. రమణమహర్షి గారు భిక్ష ఎలా చేసుకుంటారు అంటే గిన్నె పట్టుకెళ్ళరు , చేతులు ఇలా పెడతారు. ఆ చేతిలో మనం ఎన్నో కొన్ని ముద్దలు వేస్తాం అనుకోండి, అది తినేసి చెయ్యేమో తలకి రాసుకుని వెళ్ళిపోతాడు, గిన్నె ఏమీ పట్టుకు వెళ్ళడు. వాళ్ళు పేకాట ఆడుకుంటున్నారు ఈయన వెళ్ళేటప్పటికి, వాళ్ళేమో వెళ్ళవయ్యా అన్నారు. వీళ్ళు పొమ్మంటున్నారు అని తల్లి చూసి ఏమి చేసిందంటే, ఆయనని నిలబడమని లోపల అన్నం, కూరకలిపేసి ఆవిడ తెచ్చి భగవాన్‌కి పెట్టింది. ఈలోపు భగవాన్ ఆ పేకాట ఆడేవాళ్ళ వంక చూస్తున్నారు. వాళ్లకి ఒక నెల రోజులలో ఈ పేకాట ఆడాలనే బుద్ధి పోయింది. పేకాట మీరు మానేయండి అని ఆయనేమి చెప్పలేదు. ఆ నలుగురికి కూడా ఒక నెల రోజులలో పేకాట ఆడాలనే బుద్ధి పోయింది. అంటే జ్ఞాని యొక్క ప్రభావం అటువంటిది. ఆ బుద్ధి పోయింది, ఆ బుద్ధి పోతే ఇంక ఎక్కడ ఆడతారు? అంటే కోరిక ఉండి నిగ్రహించుకోవడం వేరు, అసలు కోరిక లేకపోవడం వేరు.

"Who am I?" రాశాడు కదా , శివప్రకాశం పిళ్ళై, ఆయన అరుణాచలం వచ్చాడు.

ఈయన వేసిన ప్రశ్నలకి భగవాన్ సమాధానం చెప్పారు. అదే "Who am I?". తరువాత కొంత కాలానికి ఆయన భార్య పోయింది. భార్య పోయిన నాలుగు సంవత్సరాలకి రెండో పెళ్లి చేసుకుందామా, మానేద్దామా అని ఆయనకి అనుమానం వచ్చింది. ఎవరికి? శివ ప్రకాశం పిళ్ళైకి. ఆయన భగవాన్ దగ్గరకి వచ్చారు. భగవాన్ అప్పుడు విరూపాక్ష గుహలో ఉన్నారు. ఏవండీ స్వామి నా భార్య పోయి నాలుగు సంవత్సరాలు అయ్యింది, మళ్ళీ నన్ను పెళ్లి చేసుకోమంటారా, వద్దంటారా? అని భగవాన్‌ను అడిగాడు. చేసుకోమంటే చేసుకోమని చెప్పవచ్చు, వద్దంటే వద్దు అని చెప్పవచ్చు. అదీ చెప్పడు, ఇదీ చెప్పడు. ఇంక ఆయనకి ఇష్టం లేదేమోఅని పెళ్లి చేసుకోవడం మానేశాడు అనుకోండి, పోనీ మానేయమని చెప్పవచ్చు కదా, మానేయమని చెప్పడు. చేసుకోమని చెప్పడు. అంటే ఆయన ఉద్దేశ్యం ఏమిటి అంటే, లోపల వాడు మారు మనస్సు పొందేలా మనం చెయ్యాలి కానీ ఊరికే మాట చెబితే ప్రయోజనం ఏముందని!

కొంతమందికి ద్వేషం స్వభావంగా ఉన్నప్పటికీ, ద్వేషించేవారు అయినప్పటికీ గురు దర్శనం చేత పాపప్రక్షాళన పొందుతారు. ఒకవేళ నువ్వు జ్ఞానిని దర్శనం చేస్తే, ఒక మహాత్ముడిని దర్శనం చేస్తే, అంతకుముందు పూర్వ జీవితంలో నీకు ఏమైనా దోషాలు ఉన్నా, లోపాలు ఉన్నా, బలహీనతలు ఉన్నా, నెమ్మదిగా అవి నశించిపోతాయి, క్షీణించిపోతాయి, పాపప్రక్షాళన పొందుతారు. నీ దేహానికి డబ్బై సంవత్సరాలు, ఎనభై సంవత్సరాలు వయసు ఉంది. కాని నీ వాసన వయసు కొన్ని లక్షల సంవత్సరాలు ఉండవచ్చు, కొన్ని కోట్ల సంవత్సరాలు ఉండవచ్చు. అందుచేత ఎక్కడో హృదయం యొక్క లోతుల్లో దాగి ఉన్న వాసనని నెమ్మదిగా బయటకి లాగి మంట పెడతాడు వాటిని, వాడే గురువు. వాటిని బయటకి లాగితేనే కానీ మంట పెట్టడం కుదరదు. అది నీతోటి మాట్లాడదు. ఏ tendency, ఏ బలహీనత నిన్ను ఇబ్బంది పెడుతుందో, దానిని బయటకి లాగి మంట పెడతాడు, దానిని బూడిద చేస్తాడు వాడే గురువు. ఇదంతా silentగా చేసుకుపోతూ ఉంటాడు. వాడికి భజంత్రీలు అక్కర్లేదు. ఈ భజంత్రీలు, ఈ ఊరేగింపులు, వాడికి అక్కర్లేదు. ఇదంతా వాడు silentగా చేసుకుపోతూ ఉంటాడు.

కొంతమంది ఎక్కువ ద్వేషిస్తారు. ఎదుటి వాళ్ళు ఎవరైనా బాగుపడుతుంటే, పచ్చగా ఉంటే, వెంటనే మనకి సంతోషం రావాలి. వెంటనే సంతోషం మనకి రావటం లేదు అనుకోండి మనకిలోపల ఏదో దోషం ఉన్నట్టే గుర్తు. మీకు ఏదైనా దోషం ఉంటే, మీకు ఏదైనా బలహీనత ఉంటే, గురువు దర్శనం చెయ్యడం వల్ల అవన్నీ కూడా మీకు క్రమేణా తగ్గిపోతాయి. నువ్వు కంగారు పడక్కర్లేదు. నువ్వు వర్రీ పడక్కర్లేదు. అది గురువు

చూసుకుంటాడు. అంటే నీ హృదయంలో ఉన్న రాళ్ళని తీసి బయట పడెయ్యటానికి గురువు మోయలేనంత బరువైనరాళ్ళు నీ హృదయంలో లేవు. గురువు శక్తికి మించిన రాయి అక్కడ లేదు. ఎంత బరువైన రాయి నీ హృదయంలో ఉన్నప్పటికీ దానిని బయటకి తీసి మంట పెడతాడు, వాడే గురువు. వాళ్లకి జ్ఞానమే ప్రధానం. మహిమల గురించి కూడా వాళ్ళు మాట్లాడరు అది జ్ఞానం యొక్క వైభవానికి భంగం అని. మీ వల్ల నాకు ఉపకారం జరిగింది అంటే నిజమే అని చెప్పే దేవుడు కాదు వాడు, yes అంటే వాడి జ్ఞానం యొక్క వైభవానికి, వాడి అంతస్తుకి భంగం. మీ వల్ల మాకు కడుపు నొప్పి తగ్గిపోయింది, తలకాయ పోటు తగ్గిపోయింది, మీ వల్ల మాకు ఏవో ఉపకారాలు జరిగిపోతున్నాయి అంటే, ఇటువంటి వాటికి తలవంచే మనిషి కాదు వాడు. ఇవన్నీ జరిగితే జరగచ్చు కానీ ఇవన్నీ సెకండరీ. అంటే ఈ గొడవల్లోకి మీ మనస్సుని రానివ్వడు. మీ మనస్సుని రానిస్తే అసలు లక్ష్యాన్ని మర్చిపోతారు. An aimless life is always miserable life, and the quality of aim is depending on quality of your life. ఇది బాగా జ్ఞాపకం పెట్టుకోండి. జీవితానికి ఒక గమ్యం పెట్టుకోవాలి. ఆ గమ్యం పెట్టుకున్నవాడు కూడా ఏవైనా పొరపాట్లు చెయ్యవచ్చు. జీవితానికి ఒక గమ్యం పెట్టుకున్నవాడు పది తప్పులు చేస్తే, అసలు గమ్యం లేనివాడు వంద తప్పులు చేస్తాడు. అందుచేత గమ్యం పెట్టుకుంటే, మనం చేసే తప్పులు కూడా తగ్గుతాయి. మన బలహీనతలు కూడా తగ్గుతాయి. ఎందుచేత? గమ్యం సాధించడం కోసం బలహీనతలు తగ్గించుకుంటాం. మనకి రోగం వస్తే పత్యం చేస్తాం. ఎందుకు? ఆరోగ్యం కోసం. పత్యంపత్యం కోసం చెయ్యం, ఆరోగ్యం సంపాదించడం కోసం చేస్తాం. అలా భగవదనుభవం పొందడం కోసం ఏవైనా బలహీనతలు ఉంటే పోగొట్టుకుంటాం. అందుచేత గోల్ ఉండాలి. గోల్ ని సాధించడంలో నువ్వు వెనక్కి చూడనక్కర్లేదు.

స్వామీజీ చెప్తారు go forward, march forward, move forward no need of looking behind. ప్రతీ దానికి వెనక్కి తిరిగి చూడనక్కర్లేదు. సమగ్రంగా ఆలోచించుకో, ఇది సాధించాలి అని అనుకో, గమ్యాన్ని దృష్టిలో పెట్టుకో, నువ్వు ప్రయాణం చెయ్యి. అంతేకానీ ప్రతీ చిన్న విషయానికి నువ్వు అనుమానించవద్దు. నువ్వు అనుమానిస్తుంటే నీ ప్రయాణం సాగదు. ఈశ్వరుడు, గురువు, ఆత్మ ఒక్కటే. గురు దర్శనం చేత నీలో ఉన్న దోషాలు వాటంతట అవే రాలిపోతాయి. నువ్వు ప్రయత్నం చేస్తే పోగొట్టుకోలేవు. ప్రయత్నం చెయ్యాలి కానీ ఈశ్వర కటాక్షం కూడా ఉండాలి. అప్పుడు నీకు తెలియకుండానే అవి రాలిపోతాయి. కురుపు తగ్గిపోయింది అనుకోండి పైపెచ్చు ఎప్పుడు రాలిపోతుందోమనకి తెలియదు. నువ్వు గట్టిగా గిల్లక్కర్లేదు దానంతట అదే పెచ్చు రాలిపోతుంది. అంత సహజంగా నీలో ఉన్న

బలహీనతలు ఈశ్వర అనుగ్రహం వల్ల, గురువు అనుగ్రహం వల్ల, ఆత్మ అనుగ్రహం వల్ల రాలిపోతాయి. ఈశ్వరుడు అన్నా, గురువు అన్నా, ఆత్మ అన్నా ఒక్కటే. ఇది బాగా అర్థం చేసుకోండి. బాగా సాధన చేస్తున్నాం అని లోకం చెప్పుకోవాలి అని మీరు చూస్తున్నారు కానీ మీరు బాగా సాధన చేస్తున్నారు అని మీ హృదయంలో ఉన్న ఈశ్వరుడు అనుకోవాలి. లోకం చెప్పుకుంటే మీకు ఏమీ రాదు, మన తాళం చెవి లోకంలో లేదు, ఈశ్వరుడి దగ్గర ఉంది. ప్రజలు అందరూ మీరు సాధన బాగా చేస్తున్నారు అంటున్నారు అనుకోండి మీకు కలిసి వచ్చేది ఒక పైసా లేదు. కానీ ఈశ్వరుడు అనుకోవాలి ఈ సుబ్బమ్మ సాధన బాగా చేస్తోంది అని. ఎవడికైతే ఈశ్వరుడు తెలియబడాలి అనుకుంటాడో వాడికే తెలియబడతాడు కానీ డిమాండ్ చేస్తే తెలియబడడు వాడు. ఏ జీవుడికి అయితే భగవంతుడు తెలియబడాలి అనుకుంటాడో, వాడికి మాత్రమే భగవంతుడు తెలియబడతాడు. భగవంతుడిని తెలుసుకోవాలి అని నేను అనుకుంటే నాకు తెలియబడడు. ఎందుచేత? నా బుద్ధికి ఒక object కాదు వాడు. వాడు అనుకోవాలి నాకు తెలియబడాలి అని, వాడు అనుకుంటే మటుకు నాకు తెలియబడతాడు.

మీ హృదయంలో ఉన్న ఆత్మని తెలుసుకోవడానికి మీరు ప్రయత్నం చేస్తుంటే, అది true సాధన అయితే, అది real సాధన అయితే, అది faithful సాధన అయితే, అది devoted సాధన అయితే, మీ హృదయంలో ఉన్న ఆత్మ మీ సాధనని చూస్తూ ఉంటుంది. అప్పుడు మీ హృదయంలో ఉన్న ఆత్మే గురువు వేషం వేసుకుని, కాళ్ళు చేతులు తొడుగుకుని వస్తుంది బయటకి నిన్ను అనుగ్రహించడం కోసం, వాడు దేవుడు. ఆత్మ వేరు, గురువు వేరు, దేవుడు వేరు కాదు. నీ హృదయంలో ఉన్న ఆత్మే నిన్ను అనుగ్రహించడం కోసం ఒక రూపం ధరించి వస్తుంది, అదే గురువు. భక్తి వల్ల నువ్వు purify అవ్వాలి. గొప్పల కోసం కాదు భక్తి. నీ మనసు purify అవ్వాలి. భక్తి భావన వల్ల నువ్వు పవిత్రుడవుఅవ్వాలి.



**భౌతిక జీవితం వేరు, ఆధ్యాత్మిక జీవితం వేరు అని చాలామంది అనుకుంటారు. నీ భౌతిక జీవితం సరిగ్గా లేకపోతే ఆధ్యాత్మిక జీవితం ఏమీ ఉండదు. ఈ భౌతిక జీవితాన్ని ఎప్పటికప్పుడు సరి చేసుకుంటూ ఎరుకలో జీవిస్తూ ఉంటే నీకు ఆత్మజ్ఞానం అందుతుంది.**

మనల్ని మనం పవిత్రులని చేసుకోవడానికే యజ్ఞాల యొక్క ప్రయోజనం. ఈ గీతా భవనాల యొక్క ప్రయోజనం ఏమిటి అంటే మానవుడు పవిత్రుడు అవ్వడం కోసమే, ఈ స్నానాలు, ఈ జపాలు, ఈ ధ్యానాలు, ఈ విచారణలు, ఈ సాధనలు, ఈ నదుల్లో మునగటాలు, ఇవన్నీ కూడా మనల్ని మనం పవిత్రులని చేసుకోవడానికే. చేతిలో డబ్బు ఉంటే బజారులో ఉన్న వస్తువు కొనుక్కోవటం ఎంత తేలికో, నువ్వు పవిత్రుడివి అయితే జ్ఞానం రావడం కూడా అంత తేలిక. అంటే ఈశ్వరుడి పట్ల భక్తి కనుక ఉంటే నువ్వు పక్వానికి వస్తావు. నీకు బాగా maturity వచ్చేస్తుంది.

కొంతమంది శరీరాలు చూస్తే డబ్భై ఏళ్ళు, ఎనభై ఏళ్ళు ఉంటాయి కానీ తలకాయలు మటుకు ఆరో నెల – ఏడో నెల పిల్లవాడు కింద ఉంటాయి. మీకు అర్థం అవుతోందా? శరీరాలు చూస్తే డబ్భై ఏళ్ళు వచ్చేస్తాయి. లోపల చూస్తే ఆరు నెలల పిల్లోడు, సంవత్సరం పిల్లోడు ఎలా ఉంటాడో ఆ చేష్టలు అలా ఉంటాయి. అంటే బుర్ర ఎదగదు. మెదడు ఎదగదు. వాళ్ళేమి evolve కారు. శరీరాలు చూస్తే డబ్భై ఏళ్ళు, ఎనభై ఏళ్ళు వచ్చేసి ఉంటాయి. అలా కాదు నీ భక్తి వల్ల నీ మనస్సు పక్వానికి రావాలి, నువ్వు బాగా ముగ్గాలి. నువ్వు ఎన్నాళ్ళు చూసినా పచ్చి పచ్చిగా ఉండకూడదు. నీకు maturity రావాలి. తల్లి కడుపు లోంచి బయటకి వచ్చాక మనం శారీరకంగా ఎలా ఎదిగామో, మానసికంగా కూడా అలా ఎదగడానికి ప్రయత్నం చెయ్యాలి. చైతన్యస్థాయి పెంచుకోవాలి. వివేకం పెరగాలి, ఆ గ్రహించే శక్తి పెరగాలి. అంటే భక్తి వల్ల నువ్వు మొద్దు అబ్బాయివి అవ్వకూడదు, ఈ భక్తి వల్ల నువ్వు పరిపక్వానికి రావాలి. Maturity నీకు కలగాలి. భగవంతుడు గురు రూపంలో వచ్చి ఒక మాట చెబితే, అర్థం చేసుకునే శక్తి ఎప్పుడైతే నీకు వస్తుందో, అవగాహన చేసే శక్తి ఎప్పుడు వస్తుందో, అప్పుడు ఆయన నిన్ను ఆకర్షించుకుని గురు రూపంలో వస్తాడు. గురు రూపంలో రావటమే కాదు నువ్వు ఏ దేశంలో ఉన్నా, ఏ కాలంలో ఉన్నా, ఏ ప్రాంతంలో ఉన్నా, ఆయన నిన్ను ఆకర్షించుకుంటాడు, వాడే దేవుడు. ఏమి చెబుతున్నారు సబ్జెక్టు. కేవలం నీ లోపల ఉన్న ఆత్మ గురురూపంలో రావటమే కాదు. నువ్వు ఎక్కడ ఉన్నా, నువ్వు కేశవరంలో ఉన్నా, భీమవరంలో ఉన్నా, విశాఖపట్నంలో ఉన్నా, అమెరికాలో ఉన్నా, రష్యాలో ఉన్నా, నువ్వు పక్వానికి వచ్చావు కాబట్టి ఆత్మ గురురూపంలో వచ్చి, అదే నిన్ను ఆకర్షించుకుంటుంది. ఆ మాట యొక్క విలువ నీకు అర్థం అయ్యేలా అదే చేస్తోంది. భగవంతుడు గురురూపంలో వచ్చి నిన్ను ఆకర్షించుకుంటాడు. ఆయన మీద మనకి ప్రేమ కలగదు, ఆయన మీద మనకి ప్రేమ కలిగేలా ఆయనే చేసుకుంటాడు. వాడే గురువు. మీకు అర్థం అవుతోందా? గురువు అంటే ఎవరు? గురువు మీద మనకి ప్రేమ కలిగేలా గురువే చేసుకుంటాడు. లేకపోతే ఈ అహంకారం

ఎవరినైనా ప్రేమిస్తుందా? అందరికంటే నేను గొప్ప అనుకుంటూ ఉంటే ఈ అహంకారం ఎవరిని ప్రేమిస్తుంది? బయట ఉన్న గురువు ఏమి చేస్తాడు? నిన్ను ఆకర్షించుకుంటాడు, నిన్ను బుజ్జగిస్తాడు, నిన్ను లాలిస్తాడు, నీకు స్వప్న దర్శనం కూడా ఇస్తూ ఉంటాడు. ఆయన మీద ఆకర్షణ కలిగేలా ఆయనే చేస్తాడు.

రమణమహర్షి గారు అనేవారు ఓ అరుణాచలేశ్వరుడా, ఈ లోకం పిచ్చి పోవడానికి నీ పిచ్చి నాకు బాగా ఉపయోగపడింది. ఇప్పుడు నీ పిచ్చి పోతేనే కానీ నాకు స్వరూపం తెలియదు. నీ పిచ్చి ఎవడూ పోగొట్టలేడు, నువ్వే పోగొట్టాలి. అందుచేత అరుణాచలేశ్వరుడా నీ మీద నాకున్న పిచ్చి నువ్వే పోగొట్టు. నువ్వు పోగొట్టకపోతే పోగొట్టడానికి సమర్థులు ఎవరూ ఈ సృష్టిలో లేరు. ఆ పిచ్చి పోతేనే కానీ చివరి అంతస్తుకి నేను చేరలేను. ఆ సుప్రీం స్టేట్‌కి, ఆ natural స్టేట్‌కి నేను చేరలేను. ఓ అరుణాచలేశ్వరుడా! అది కూడా నువ్వే అనుగ్రహించాలి. నా యందు ప్రేమ కలిగి, నా యందు దయ కలిగి నువ్వు నన్ను అనుగ్రహించాలి కానీ లేకపోతే నీకు చెప్పడానికి సరిపోయినవాడు ఈ సృష్టిలో ఎవరు ఉన్నారు? బయట బాహ్యముఖంగా, externalగా నీ మనసు విజృంభిస్తుంటే ఆ మనస్సుని లోపలకి నెట్టి వేస్తాడు. ఎవరు? ఈ బయట గురువు. వాడే నిన్ను ఆకర్షించుకుంటాడు. వాడి మాటల విలువ తెలిసేలాగా నీ బుద్ధికి వివేకం ఇస్తాడు. నీ పాడు బుద్ధికి వాడి మాటల విలువ తెలియదు. నీ పాడు బుద్ధిని సంస్కరించి, ఆ మాటల యొక్క విలువ నీ మనసుకి పట్టేలాగ వాడేనిన్ను అనుగ్రహిస్తాడు. అందుచేత లోపల ఆత్మ రెడీగానే ఉన్నాడు. బయట గురువు ఊరికే తాత్కాలికం. ఊరికే లాగూ, చొక్కా తొడుగుకుని వచ్చాడు, వాడు ఎప్పుడూ అక్కడ ఉండడు. శరీరానికి మాములుగా కాళ్ళు, చేతులు ఉండాలి కాబట్టి తొడుగుకుని వచ్చాడు. నోరు ఉండాలి కాబట్టి నోరు ఒకటి తొడుగుకుని వచ్చాడు. కానీ ఎప్పుడూ అక్కడ ఉండడు. నిన్ను లోపలకి గెంటేశాక వాడు బయటకి పోతాడు. లోపల ఉన్న ఆత్మ గుంజేసుకుని దాని స్వరూపాన్ని నీకు ఇచ్చేస్తుంది.

ఒక భక్తుడు అరుణాచలేశ్వరుడితో ఇలా అన్నాడు ఓ అరుణాచలేశ్వరుడా! ఇప్పుడు నీకు నాకు business జరిగింది. ఈ businessలో నీకు నష్టం వచ్చింది, నాకు లాభం వచ్చింది అన్నాడు ఆ భక్తుడు. అరుణాచలేశ్వరుడు ఏమి చేశాడు? వీడి అజ్ఞానాన్ని పుచ్చేసుకున్నాడు, వాడి జ్ఞానాన్ని వీడికి ఇచ్చేశాడు. దేవుడు జ్ఞానాన్ని ఈ భక్తుడికి ఇచ్చేశాడు, ఆ భక్తుడి అజ్ఞానాన్ని దేవుడు పుచ్చుకున్నాడు. పెంటతో సమానమైనది, పనికిరానిది అయిన నా అజ్ఞానాన్ని నువ్వు పుచ్చుకున్నావు, నీ దగ్గర ఉన్న బంగారంలాంటి జ్ఞానాన్ని నాకు ఇచ్చేశావు. అందుచేత నీకు నష్టం వచ్చింది. ఈ వ్యాపారంలో నాకే లాభం వచ్చింది

అన్నాడు ఆ భక్తుడు. ఎంతో పురోగతి సాధించినవారు, అసాధారణ వ్యక్తులు తప్పితే మిగిలిన వారు అందరికీ గురువు సాధారణంగా అవసరమే. రమణమహర్షి గారికి గురువు లేరు. అరుణాచలేశ్వరుడే గురువుగా వ్యవహరించాడు ఆయనకి. ఒక మహా ప్రవాహంలో గడ్డి పరక ఎంత తేలికగా కొట్టుకుపోతుందో, మధుర నుండి అరుణాచలం అంత తేలికగా వచ్చాడు. తల్లి ఒడిలోంచి తండ్రి ఒడిలోకి వచ్చాడు. మధుర తల్లి ఒడి, అరుణాచలం తండ్రి ఒడి. తల్లి ఒడిని విడిచి పెట్టేసి తండ్రి ఒడికి వచ్చాడు. తండ్రి పిలిస్తే వచ్చాడు. ఎలా వచ్చాడు? మహా ప్రవాహంలో గడ్డి పరక ఎలా కొట్టుకుని పోతుందో అంత వేగంగా వచ్చి పడ్డాను అన్నాడు. ఊరికే కేక వేశాడు రమ్మని, ఆ స్మరణ మాత్రం చేతే ముక్తి వచ్చింది ఆయనకి, అరుణాచలం అని ఒకసారి ఆ శబ్దం విన్నాడు. విన్నంత మాత్రం చేతే ఆయన మోక్ష స్థితిని పొందాడు. అంటే అరుణాచలేశ్వరుడే ఈయనకి గురువుగా వ్యవహరించాడు.

అర్జునుడి వైభవం చూడండి. కృష్ణుడు ఎవరు? దేవుడే. దేవుడే అర్జునుడికి గురువు అయ్యాడు. అదే విధంగా అరుణాచలేశ్వరుడే రమణస్వామికి గురువు అయ్యాడు. గురువు అయ్యి ఆకర్షించుకున్నాడు. జిడ్డు కృష్ణమూర్తి గారు ఏమని చెప్పేవారు అంటే, గురువు లేకుండా జ్ఞానం సంపాదించవచ్చు అని మీటింగులో చెప్పేవారు. ఆ మీటింగులో ఒకడు జిడ్డు కృష్ణమూర్తి గారు చెప్పిన మాట విని రమణమహర్షి గారి దగ్గరకి వచ్చాడు. ఏవండీ జిడ్డు కృష్ణమూర్తి గారు జ్ఞాన సముపార్జనకి గురువు అక్కర్లేదు అంటున్నారు అని చెప్పాడు. రమణమహర్షి గారి reply చూడండి. ఆయన ఆలోచనా విధానం చూడండి. ఆ సమాధానాలలో ఉన్న అందాలు చూడండి. మనం వంద PhDలు పుచ్చుకున్నా ఇలాంటి సమాధానాలు చెప్పలేము. జిడ్డు కృష్ణమూర్తి గారు గురువు లేకుండా జ్ఞానం సంపాదించవచ్చు అన్నారని చెప్పాడు. భగవాన్ చెప్పిన reply చూడండి wonderful reply. జిడ్డు కృష్ణమూర్తి గారికి గురువు అక్కర్లేకుండా జ్ఞానం వచ్చి ఉండవచ్చు. ఇతరులు ఎవరికీ గురువు అక్కర్లేదు అని ఆయనకి ఎలా తెలుసు అన్నారు. ఆ సమాధానం చూడండి. జిడ్డు కృష్ణమూర్తి గారికి గురువు అక్కరలేక పోవచ్చు. కానీ ఇతరులు ఎవరికీ గురువు అక్కర్లేదు అని ఆయనకి ఎలా తెలుసు? అంటే ఇక్కడ విమర్శించినట్టు లేదు. స్పష్టంగా ఉన్న విషయాన్ని, మీకు బాగా ఎత్తి చూపిస్తున్నాడు. మీ కళ్లకి కనపడేలాగా, మీ బుద్ధికి అందేలా విషయం ఎత్తి చూపిస్తున్నాడు, జిడ్డు కృష్ణమూర్తి గారిని విమర్శించటం లేదు. ఆయనకి గురువు అక్కర్లేకుండా జ్ఞానం వచ్చి ఉండవచ్చు. ఇతరులు ఎవరికీ గురువు అక్కర్లేదని ఆయనకి ఎలా తెలుసు? ఆ సమాధానంలో ఉన్న అందాలు చూడండి. పుట్టుక తోటే కొంతమంది మహాత్ములుగా ఉంటారు. అసాధారణ వ్యక్తులు ఉంటారు కొంతమంది, వాళ్లకి తప్పితే మిగిలిన వాళ్ళు

అందరికీ గురువు సాధారణంగా అవసరమే. గురువు పాత్ర ఉంది.

మనం ఏదైనా విషయం నేర్చుకోవాలి అంటే గురువు ఉండాలి. మెడిసిన్ నేర్చుకోవాలి అంటే గురువు ఉండాలి. ఇంకో విషయం మీరు జ్ఞాపకం పెట్టుకోండి. మనకి గురువు దొరికినప్పుడు గురువుని విడిచి పెట్టకూడదు. లెక్కలు ఉన్నాయి అనుకోండి మనం సొంతంగా నాలుగు నెలలలో నేర్చుకునేది, గురువు దగ్గర నాలుగు గంటలలో నేర్చుకోవచ్చు. అలాగే మెడిసిన్ ఉంది అనుకోండి, మనం సొంతంగా పుస్తకాలు చదివి నేర్చుకునే దానికంటే గురువు explain చేసి చెబుతుంటే, నాలుగు నెలలలో నేర్చుకునేది ఒక నెలలో నేర్చుకోవచ్చు. అంటే మనం ఎక్కువ కష్ట పడక్కర్లేదు. గురువు చెబుతుంటే, మనం ఎక్కువ కష్టపడక్కర్లేకుండా, మన బ్రెయిన్ ఎక్కువ శ్రమ పడక్కర్లేకుండా, ఆ గురువు చెప్పటం వల్ల మనకి తొందరగా బ్రెయిన్‌కి అందుతుంది. గురువు అందుబాటులో ఉన్నప్పుడు మనం ఎక్కువ కష్టం పడక్కర్లేకుండా సబ్జెక్టు అర్థం చేసుకోవచ్చు. అందుచేత గురువుని ఉపయోగించుకోవాలి. అవకాశాలని విడిచి పెట్టక్కర్లేదు. అందుచేత గురువు అవసరమే. భౌతికమైన సైన్సెస్‌కే గురువు అవసరం అయినప్పుడు, ఈ spiritual సైన్సుకి గురువు అక్కర్లేదని ఎక్కడ ఉంది? రమణమహర్షికి లేకపోవచ్చు. ఆయనకి గురువు లేనంత మాత్రం చేత మనకి గురువు అవసరం లేదని ఆయన చెప్పడం లేదు. గురువు సాధారణంగా అవసరమే. ఒకవేళ మీకు బాహ్యామైన గురువు కావలసి ఉంటే, ఒకవేళ మీ గురువుకి శరీరం పడిపోయిన తరువాత మీరు శ్రవణం చెయ్యాలి అంటే ఇంకో గురువు దగ్గరకి వెళ్ళి శ్రవణం చెయ్యవచ్చు. సబ్జెక్టు నేర్చుకోవడంలో నీకు ఏమి ఆక్షేపణ అక్కర్లేదు కానీ అందులో ఏ గురువు కూడా రూపం కాదు. అది గుర్తు పెట్టుకో.

కొంతమంది శరీరాలు దగ్గరగా ఉంటాయి. ఇళ్ళల్లో కూడా భార్య, భర్త దగ్గరగానే ఉంటారు. కానీ కొంతమంది మానసికంగా ఎంతో దూరాన ఉంటారు. ఒకళ్ళ మీద ఒకళ్ళకి ప్రేమ ఉండదు. భౌతికంగా చూస్తే దగ్గరగానే ఉంటారు. మనస్సు చూస్తే ఒకడికి రష్యాలో ఉంటుంది, ఒకడికి అమెరికాలో ఉంటుంది. ఒకళ్ళ మీద ఒకళ్ళకి నమ్మకాలు

**నీవు శాంతిగా ఉంటే, నీ హృదయములో ఉన్న పరమాత్మ నీకు సన్నిహితంగా ఉంటాడు.**



ఉండవు. ఒకళ్ళ మీద ఒకళ్ళకి ఆప్యాయతలు ఉండవు. అటువంటి వాళ్ళు భౌతికంగా దగ్గరగా ఉన్నప్పటికీ వాళ్ళు దూరంగా ఉన్నట్టే లెక్క. రమణమహర్షి చెప్పేది ఏమిటంటే, భౌతికంగా నువ్వు దూరంగా ఉన్నప్పటికీ, నా శరీరం ఎక్కడో ఉన్నప్పటికీ, నీ శరీరం ఎక్కడో ఉన్నప్పటికీ, హృదయంలో ప్రేమ ఉన్నప్పుడు, ఆప్యాయత ఉన్నప్పుడు, మనం దగ్గరగా ఉన్న వాళ్ళతోటి సమానమే. నీ పొరుగువాడు ఎవడు అన్నాడు యేసుక్రీస్తు? నీ క్షేమం ఎవడైతే కోరుతున్నాడో, నీ శ్రేయస్సు ఎవడైతే కోరుతున్నాడో, నీ ఉజ్వల భవిషత్తు ఎవడైతే కోరుతున్నాడో, వాడు అమెరికాలో ఉన్నప్పటికీ వాడు నీ పొరుగువాడు అన్నాడు యేసు. కొంతమంది మన పొరుగు వాళ్ళు ఉంటారు, మనం ఎప్పుడు చస్తామా అని కనిపెట్టుకుని ఉంటారు. వాళ్ళు neighbours కాదు. మన పొరుగున ఉండి మనం ఎప్పుడు పాడైపోతామా అని కనిపెట్టుకుని ఉండేవాళ్ళు మన neighbours కాదు. పొరుగు వాడు ఎవరంటే, నీ క్షేమం కోరేవాడు, నీ శ్రేయస్సు కోరేవాడు, నీ భవిషత్తు కోరేవాడు, వాడు అమెరికాలో ఉన్నప్పటికీ వాడు నీ పొరుగు వాడితోటి సమానం. నీ పాడు కోరేవాడు నీ పక్కన ఉండవచ్చు భౌతికంగా, వాడు నీ పొరుగువాడు కాదు. నీ శ్రేయస్సు కోరేవాడు ప్రపంచంలో ఎక్కడున్నా నీకు పొరుగువాడు. నీ దేహం ఎక్కడైనా ఉండవచ్చు, నా దేహం ఎక్కడైనా ఉండవచ్చు. మానసిక అనుబంధం ముఖ్యం, mental contact ముఖ్యం. హృదయంలో అనురాగం ముఖ్యం. హృదయంలో ప్రేమ ముఖ్యం. మానసికమైన సాంగత్యం ముఖ్యం. భౌతికంగా దగ్గర ఉండడం అనేది సెకండరీ. శరీరాలు ఎక్కడ ఉన్నా మన మనసులు సమీపంలో ఉండాలి. హృదయాలు సమీపంలో ఉండాలి. ఆప్యాయతలు పోగొట్టుకోనక్కర్లేదు. భౌతికంగా దగ్గరగా ఉండడం కంటే, మానసిక అనుబంధం, మీ ఆధ్యాత్మిక అభివృద్ధికి చాలా దోహదకారి అంటున్నారు ఇక్కడ భగవాన్.

మనం పూజ దేనితోటి చేస్తాం? చేతుల తోటి చేస్తాం. జపం దేనితోటి చేస్తాం? నోటి తోటి చేస్తాం. ధ్యానం దేనితోటి చేస్తాం? మనస్సు తోటి చేస్తాం. పూజ కంటే జపం గొప్పది, జపం కంటే ధ్యానం గొప్పది. ఇవన్నీ ఎందుకు? మనస్సు పవిత్రం అవ్వడం కోసమే. మనస్సు purify అవ్వడం కోసం, ఏకాగ్రత కోసం, సమగ్రత కోసం, ప్రవీణత కోసం, పవిత్రత కోసం. ఈ పూజలు, ఈ జపాలు, ఈ ధ్యానాలు, ఈ విచారణలు అన్నీ కూడా మనల్ని మనం purify చేసుకోవడం కోసమే. స్వామి శివానంద అంటూ ఉండేవారు, పక్షి ఎగరటానికి రెండు రెక్కలు ఉండాలి. అదే విధంగా ఆధ్యాత్మికంగా నువ్వు అభివృద్ధి చెందాలి అంటే నీకు రెండు రెక్కలు ఉండాలి. ఒకటి పవిత్రత, రెండు ఏకాగ్రత. ఏకాగ్రత, పవిత్రత అనే రెక్కలు ఉండాలి నీకు. పక్షి ఏ విధంగా అయితే గాలిలో ఎగురుతుందో,

అలా ఆధ్యాత్మికంగా నువ్వు ఎగరాలి అంటే, ఆధ్యాత్మికంగా నీ హృదయాంతరాళాల్లోకి చొచ్చుకు పోవాలి అంటే, నీకు రెండు అవసరం.

స్వామీ వివేకానంద అనేవారు జ్ఞానం అనే పెట్టె మన హృదయంలోనే ఉంది కానీ తాళం చెవి మటుకు దేవుడు దగ్గర పెట్టుకున్నాడు. పెట్టె మన దగ్గరే ఉంది కానీ తాళం చెవి మాత్రం ఈశ్వరుడు దగ్గర ఉంది. వాడు సంతోషించేలా మనం బ్రతికితే మన తాళం చెవి మనకి పడేస్తాడు. మనం పెట్టె ఓపెన్ చేసుకుంటే జ్ఞానులం అయిపోతాం. దేవుడు ఏమి చేశాడు అంటే పెట్టె మన హృదయంలో పెట్టాడు. తాళం చెవి మనకి ఇవ్వకుండా వాడి దగ్గర పెట్టుకున్నాడు. వాడి అనుగ్రహం మనం సంపాదిస్తేనే కానీ మన తాళం చెవి ఇవ్వడు వాడు. కళ్యాణ గుణాలు తప్పనిసరిగా నువ్వు ప్రాక్టీస్ చేస్తుంటే నీకు perfection కలుగుతుంది . మనం హౌరా వెళ్ళాలి అంటే హౌరా వెళ్ళే ట్రైన్ ఎక్కితే హౌరా వెళ్ళిపోతాం. మద్రాసు వెళ్ళే ట్రైన్ ఎక్కితే మద్రాసు వెళతాం. నీకు enjoyment కావాలి అంటే ఆ రైలు వేరు. Perfection కావాలి అంటే ఆ రైలు వేరు. కృష్ణుడు ఏమిచెబుతున్నాడు నేను చెప్పిన గుణాలు అన్నీ నువ్వు అభ్యసించు, ఈ రైలులోకూర్చో, perfectionకి చేరిపోతావు. ప్రాక్టీస్ చెయ్యి, నువ్వు perfection అందుకుంటావు. నువ్వు అభ్యాసం చేసి చూడు. నువ్వు హృదయంలోకి దిగు, నీ మనస్సుని హృదయంలో ముంచు.

భగవాన్ మార్గ త్రయం చెప్పారు కదా. అంటే ఆత్మని వెతుకు. ఆత్మని వెతికే శక్తి లేకపోతే నీ మనస్సుని తీసుకెళ్ళి ఆత్మలో ముంచు. అదీ చేతకాకపోతే, ఇదీ చేతకాకపోతే నీ ముక్కులో గాలిని పట్టుకో! Subtleintellect ఉన్నవాళ్ళు సబ్జెక్టు చెప్పేటప్పుడు అల్లుకుపోతారు. గురువు నోటి వెంట మాట వస్తే చాలు అల్లుకుపోతాడు subtleintellect ఉన్నవాడు. కొంతమంది మొద్దు అబ్బాయిలు ఉంటారు వాళ్ళని ముందు బెంచీలో కూర్చోబెట్టాలి. వాళ్లకి చదువు అర్థం కాకపోయినా ముందు అల్లరి చెయ్యకుండా ఉంటారు. ఆత్మ విచారణ అన్నా, మనస్సుని తీసుకుని వెళ్లి ఆత్మలో ముంచమన్నా, లేకపోతే ఆత్మ కోసం వెతకడం అన్నా subtleintellect ఉన్నవాళ్లకి అర్థం అవుతుంది. ఈ grossintellect ఉన్నవాడు ఆత్మ విచారణ చెయ్యలేడు. ముక్కులో గాలి కనిపిస్తూ ఉంటుంది వాడికి, ఆ ప్రాణాన్ని నియమించుకో, ప్రాణాన్ని నియమించుకోవడం వల్ల మనస్సు నిగ్రహించబడుతుంది. నిగ్రహింపబడిన మనస్సు, ఏకాగ్రం పొందిన మనస్సు, సత్యాన్వేషణకి నీకు సహకరిస్తుంది. ప్రాణాయామం వల్ల మనస్సు నశించదు కానీ మనస్సుకి ఏకాగ్రత వస్తుంది. ఏకాగ్రమైన మనస్సు, ఏకాగ్రమైన బుద్ధి సత్యాన్వేషణకి fitness సంపాదిస్తుంది. ముందు Graduation అయిపోయి ఉంటే తరువాత ఉద్యోగం రావచ్చు, రాకపోవచ్చు. అంటే ముందు నువ్వు ప్రాణాయామాలు చేస్తే మైండ్ సత్యాన్ని తెలుసుకోవటానికి

ఫిట్ అవుతుంది. Deserve అవుతుంది mind. తరువాత వస్తుందో, రాదో అది వేరే విషయం. ఇప్పుడు మనస్సు ఎక్కడ ఉంది? బ్రెయిన్‌లో ఉంది. కానీ దానిని ఏమి చెయ్యాలి? హృదయంలో ఉంచండి. ఇది బాగా అర్థం చేసుకోండి. హృదయంలో మనస్సుని ఉంచండి. హృదయంలో మనస్సుని ముంచండి. మనకి ముంచాలి అని ఉంది, ఉంచాలి అని ఉంది కానీ అది బయటకి వచ్చేస్తోంది.

రమణమహర్షి చెబుతున్నాడు, కృష్ణుడు చెబుతున్నాడు, రాముడు చెబుతున్నాడు, ఎవరో అవతార పురుషుడు చెబుతున్నాడు అని మనకి మనస్సుని హృదయంలో ముంచాలని ఉంది కానీ అది బయటకి వచ్చేస్తుంది. అది బయటకి రావటానికి కారణం ఏమిటి? tendency. వాసన మిమ్మల్ని బయటకు లాక్కొచ్చేస్తుంది, మీ అలవాట్లు మిమ్మల్ని లాక్కొచ్చేస్తున్నాయి. అర్థం అవుతోందా? మనస్సు హృదయంలో ఉండగా, బ్రెయిన్ లోకి ఏ తలంపు అయితే తీసుకువచ్చేస్తుందో, అదే నీకు బలంగా ఉన్న తలంపు అని గుర్తించు.

భగవాన్ దొంగ. ఎవరైనా జపం చేసుకుంటాం అంటే చేసుకోండి అనేవారు. ధ్యానం చేసుకుంటాం అంటే చేసుకోండి అనేవారు. పూజ చేసుకుంటున్నాం అంటే ఆయన చేసుకోండి అనేవారు. కానీ ఆయన పద్ధతి అది కాదు. మీరు ఏ మార్గంలో ప్రయాణం చేస్తున్నా దానికి encouragement ఇచ్చేవారు. మిమ్మల్ని disturb చెయ్యకూడదు అని. అంటే మీరు వెళ్ళే మార్గాన్ని పాడు చెయ్యకూడదు. గమ్యం ఒక్కటే, మార్గాలు వేరు. ఏ రేవులో దిగినా నీళ్ళు అవే. మీకు అర్థం అవుతోందా? చెరువులో నీళ్ళు ఒక్కటే కానీ రేవులు తేడా. ఆవుల రంగులు తేడా ఉంటాయి కానీ పాలు తెల్లగానే ఉంటాయి. ఒకొక్క ఆవు రంగు ఒకొక్కలాగా ఉంటుంది కానీ పాలు మటుకు తెల్లగానే ఉంటాయి. ఎవరు ఏ మార్గంలో పొందినా జ్ఞానం ఒక్కటే. ఇంతవరకు ఈ సృష్టి ప్రారంభం అయిన తరువాత ఏ ఇద్దరు ఒకే మార్గంలో జ్ఞానం పొందలేదు, ఎవరి మార్గంలో వాళ్ళు పొందారు. అందుచేత అనుకరణ వల్ల జ్ఞానం రాదు. రమణమహర్షి కౌపీనం పెట్టుకున్నాడు అని మనం కౌపీనం పెట్టుకుంటే జ్ఞానం రాదు. అనుకరణ వల్ల మనకి జ్ఞానం రాదు. మన మార్గంలో, మనకి నచ్చిన మార్గం, మనం మెచ్చిన మార్గం, మనకి ఇష్టమైన మార్గం, మనకి ప్రీతి అయిన మార్గం మనకి ఏ మార్గం అయితే ఈజీగా ఉందో, ఆ మార్గంలో మనం ప్రయాణం చెయ్యడమే. ఇతరులని మనం అనుకరించక్కర్లేదు. జపం చేసుకోవాలంటే చేసుకో అనేవారు. మధ్య మధ్యలో అంటూ ఉండేవారు ఆ జపి ఎవరు అని? నీ లోపల ఉన్నవాడు, ఆ జపం చేసేవాడు ఎవడు?

రమణమహర్షి గారి దగ్గరకి ఒక భక్తుడు వచ్చాడు. వాడు ఏమి చెప్పాడు అంటే మేము ఒక గురువు గారి దగ్గరకి వెళ్లాం, ఆయన మాకు మంత్రం ఇచ్చారు. ఆ మంత్రాన్ని జపించుకుంటున్నాం. అయితే మా గురువు గారు ఏమని చెప్పారు అంటే, అబ్బాయి నువ్వు ఆ జపం చేసుకుంటూ ఉండు, ఆ జపం చెయ్యడం వల్ల నీకు ఫలితం వస్తుంది, ఆ ఫలితం నాకు ఇస్తూ ఉండు అని చెప్పారు వాళ్ళ గురువు గారు. నువ్వు జపం చేసుకో, ఆ జపం వల్ల ఫలితం వస్తుంది. ఫలితం మటుకు నాకు ఇచ్చేయ్ అని చెప్పారు. అప్పుడు రమణమహర్షి గారు "మీ గురువు చాలా మంచివాడు, మీ గురువు వడ్డీ మింగుతున్నాడు కానీ అసలు నీ దగ్గరే ఉంచేశాడు. ఈ గురువు వడ్డీ మింగేస్తాడు, అసలు మింగేస్తాడు" అన్నారు. ఇక్కడున్న గురువు ఏమి చేస్తాడు అంటే, వడ్డీ తినేస్తాడు, అసలు తినేస్తాడు. అంటే జపం వల్ల వచ్చే ఫలితాన్ని తినేస్తాడు, జపం చేసే జపిని కూడా తినేస్తాడు. అసలు దొంగ వాడే. జపం చేసే జపే నేరస్తుడు. జపాలు అందరూ చేస్తున్న వాళ్ళే, ఆ జపం చేస్తున్నజపి ఎవరో ఎవరికీ తెలియటం లేదు. జపం చేసే జపిని బోనులో పెట్టి ఎవరూ కూడా విచారణ చెయ్యటం లేదు. దేహం ఎక్కడ ఉందో మీమనస్సు అక్కడే ఉండాలి. ఎరుకతో చెయ్యాలి. మీరు ప్రయత్నం చెయ్యగా, చెయ్యగా ఆత్మానుభవానికి అడ్డు వచ్చే విషయాలు అన్నీ పోయి మీ స్వరూపం మిగులుతుంది. ఉన్నదేదో మిగులుతుంది, పోవాల్సింది ఏదో పోతుంది. లేనిది అంతా పోతుంది, ఉన్నది ఏదో మిగులుతుంది.

**ఓం ఓం ఓం**

**శాంతిః శాంతిః శాంతిః**

## రమణ భాస్కర చందాదారులకు విన్నపం

**రమణ భాస్కర శాశ్వత చందా (10 సం॥లకు) రు॥ 1200/-లు**. రమణ భాస్కర శాశ్వత చందాదారులుగా చేరి పత్రికను ప్రోత్సహించవలసినదిగా కోరుచున్నాము.

**సంవత్సర చందా రు॥ 150/-లు**. సంవత్సర చందాదారులకు చందా గడువు ముగిసినది. మీ చందాను స్వయంగా గానీ లేక

**శ్రీ రమణక్షేత్రం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యడ్ల బజార్, పాలకొల్లు బ్రాంచి** అకౌంట్ నెంబర్ **520101264185724 (IFSC Code : UBIN0827533)** నందు గాని చెల్లించగలరు. చందాను **బ్యాంక్ అకౌంట్‌లో జమచేసినవారు** జమచేసిన తేదీ, వారి అడ్రసును **9866715896** ఫోన్ నెంబరుకు తెలియపరచగలరు.



# శ్రీమద్భగవద్గీత

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణముల నుండి)**

**విషయా వినివర్తన్తే నిరాహారస్య దేహినః ।**
**రసవర్జం రసోఽప్యస్య పరం దృష్ట్వా నివర్తతే ॥ 2-59 ॥**

**తాత్పర్యము :** ఇంద్రియముల ద్వారా విషయములను గ్రహింపని వాని నుండి ఇంద్రియార్థములు మాత్రము వైదొలగును. కాని వాటిపై ఆసక్తి మిగిలియుండును. స్థితప్రజ్ఞునకు పరమాత్మ సాక్షాత్కారమైనందువలన వానినుండి ఆ ఆసక్తి కూడా తొలగిపోవును.

**విషయా వినివర్తన్తే –** నువ్వు కొంత కాలం తిండి మానేస్తే, చెవుల్లో గుడ్డలు పెట్టుకుంటే, కళ్ళతో చూడటం మానేస్తే, నీ ఇంద్రియాలు నిన్ను క్షోభ పెట్టకపోవచ్చు, ప్రకోపం పెట్టక పోవచ్చు, ఇంద్రియాలు నీకు వికారం, అశాంతి తీసుకురాకపోవచ్చు. అంతమాత్రంచేత నువ్వు ఇంద్రియాలని జయించినట్టు కాదు, నువ్వు స్థిత ప్రజ్ఞుడివి కాదు అంటున్నాడు కృష్ణుడు.

**నిరాహారస్య దేహినః –** నువ్వు కొన్ని రోజులు అన్నం మానేశావు అనుకో, నీ శరీరం శుష్కించిపోయి మంచాన పడి ఉన్నావు అనుకో, అపుడు నీ ఇంద్రియాలు ఏమీ కదలవు. అయితే నీ ఇంద్రియాలు జయించినట్టు కాదు. లంఖణాలు చేసిన వాడికి, చావుకి సిద్ధంగా ఉన్నవాడికి కూడా ఇంద్రియాలు అణిగిపోతాయి. అయితే వాడు జ్ఞాని కాదు,

పూర్వం కొంతమంది ఇల్లు విడిచి పెట్టి వెళ్ళిపోయి, ఎక్కడో అరణ్యాలలో అన్నం నీళ్ళు మానేసి, ఆకులు తిని, నిద్రలేకుండా కఠోరమైన తపస్సు చేసినట్టు మనం పురాణాలలో చదువుకున్నాం. కాని వారిలో కూడా అనేకమంది జ్ఞానం కలగకుండా రాలిపోయారు. విషయం గనుక మీకు అర్థం కాకపోతే, మొండితనం తోటి, మూర్ఖత్వం తోటి గనుక మీరు అన్నాలు మానేసి, నీళ్ళు మానేసి, తపస్సు చేసినంత మాత్రం చేత యోగం సిద్ధించదు అంటున్నాడు భగవంతుడు వాసుదేవస్వామి. అంటే మీరు మరణించేటప్పుడు, ఈ ఇంద్రియాలు అణిగిపోయినప్పుడు కూడా, ఈ ప్రకృతి వాసనలు పోయినవి అనుకోకండి. మరణించేటప్పుడు ఇంద్రియాలు ఏమీ గొడవ చెయ్యవు, అంత మాత్రం చేత నువ్వు గట్టెక్కావు అనుకోకు.

మీరు చనిపోయే ముందు మీ ఆస్తులు గురించి జాగ్రత్త పడిపోతున్నారు కదా! అయితే భగవంతుడు ఇంకా జాగ్రత్తగా ఉంటాడు, ప్రాణాన్ని వెళ్ళనివ్వడు. భగవంతుడు హృదయంలోనే ఉన్నాడు కాబట్టి, వాడు బంగారం తూసేవాడిలా జాగ్రత్తగా తూసి, మీ ఇంద్రియ వాసనలు, మీ మనస్సులో ఊహించిన ఊహలు, ఇంద్రియాల తోటి మీరు చేసిన

పనులు, పెంచుకున్న కాంక్షలు, కోరికలు, తలంపులు, సంస్కారాలు అన్నీ కూడా ఒక్కొక్కటి బయటకి లాగి, మనసులో జాగ్రత్త పెట్టేవరకు ఆ ప్రాణాన్ని వదలనివ్వడు ఈశ్వరుడు. ఆ వాసన, ఆ సంస్కారం, ఆ తలంపు, మళ్ళీ భవిషత్‌జన్మలో అనుభవింప చెయ్యటం కోసం మనస్సులో అన్నీ జాగ్రత్త పెట్టిన తరువాత, అప్పుడు ప్రాణాలు బయటకి లాగుతాడు. అప్పుడు అది శవం అవుతుంది దానిని తీసుకెళ్ళి స్మశానంలో కాలుస్తారు.

**రసవర్జం రసోఽప్యస్య పరం దృష్ట్వా నివర్తతే :–** అయితే జన్మ జన్మలు ఇలా కాలిపోవల్సిందేనా? ఏ జన్మకి ఆ జన్మ ఏవో పనులు చేస్తాము, పుణ్యం–పాపం చేస్తాం, ఇంద్రియాలతోటి విషయాలను గ్రహిస్తాం. ఇవి మనసులో పెడితే ఏ జన్మకి ఆ జన్మ శరీరం మనస్సు ఇంద్రియాలు ప్రకృతి వచ్చేస్తాయి కదా. ఇంక ఈ చక్రం నుండి బయట పడటానికి, ఈ జీవుడు తరించటానికి అవకాశం లేదా అని అడిగితే, – **"రసవర్జం రసోఽప్యస్య"** – ఎవడికైతే వాసన పోతుందో, ఎవడికైతే కాంక్ష పోతుందో **'పరం దృష్ట్వా'**– శరీరం, ప్రాణం ఉండగా ఆత్మని ఎవరైతే దర్శించారో, ఆ కాంతిలో శాంతిలో ఎవరైతే ప్రవేశించారో, ఆత్మశక్తిని ఎవరైతే జీవించి ఉండగానే రుచి చూశారో, ఆత్మ యొక్క సామ్రాజ్యంలోకి ఎవరైతే ప్రవేశించారో, ఒక్కసారిగా ఈ వాసనలు అన్నీ కాలిపోయి బూడిద అవుతాయి అంటున్నాడు భగవంతుడు వాసుదేవస్వామి. అంతవరకు ఈచక్రంలో కొట్టుకు పోవాల్సిందే అంటున్నాడు.

ఈ శరీరం మరణిస్తుంది, కాని మరణంలేని వస్తువు ఈ శరీరంలో ఒకటి ఉంది. దానిని పరమ పదం అంటారు. దానినే ఆత్మ, నిర్వాణం, మోక్షం అని కూడా అంటారు. ఆత్మని నువ్వు చూడగలిగితే నీలో వాసనలు అన్నీ కాలిపోతాయి. అదే నీకు కడసారిజన్మ అంటున్నాడు వాసుదేవస్వామి. మొత్తం మీద నీకు ప్రపంచవాసన, దేహవాసన, శాస్త్రవాసన ఆత్మను దర్శించే వరకు నిన్ను విడిచి పెట్టవు. చైతన్య వస్తువును సాక్షాత్కరించుకునే వరకూ, మీలోని వాసనలు మిమ్మల్నివిడిచి పెట్టవు. ఎప్పుడైతే చైతన్య వస్తువు అనుభవంలోకి వచ్చిందో, ఒక్కసారి ఈ వాసనలు సంస్కారాలు అన్నీ పడిపోతాయి. అంటే ఏ మతస్తుడు అయినా ఈ ఆత్మని, ఈ చైతన్యాన్ని అనుభవంలోకి తెచ్చుకోవల్సిందే అంటున్నాడు భగవంతుడు వాసుదేవస్వామి. ఆహారం లేని వాడిని, తపస్సు చేసే వాడిని కూడా వాసనలు విడిచి పెట్టవు. స్మశానం తోటి మన జీవితయాత్ర పూర్తి అయిపోతుంది అని మీరు ఎవరూ అనుకోవద్దు. మన దేహయాత్ర పూర్తి అవుతుంది. ఒక దేహంలో ఒక చుట్టాలు, స్నేహితులు మళ్ళీ కొత్త దేహం వచ్చేటప్పటికి కొత్త చుట్టాలు, కొత్త స్నేహితులు, కొత్త పరిసరాలు. ఈ సుబ్బారాయుడు సుబ్బరాయుడి లాగానే ఉంటాడు! ఏ జన్మలోకి వెళ్ళినా నువ్వు ఆత్మని దర్శించే వరకు నీ వాసన నిన్ను విడిచి పెట్టదు. ఆత్మని దర్శించే వరకు అంటే మోక్షాన్ని పొందేవరకు నీకు సిద్ధి కలగదు. మోక్షసిద్ధి తప్ప మిగతా సిద్ధులు, మిగతా మహిమలు అన్నీ స్వప్నం తో సమానం, అవి మాయ తోటి సమానం.

# మహాశివరాత్రి

ప్రతి సంవత్సరం మాఘ మాసం, కృష్ణపక్షం, చతుర్దశి రోజున మహాశివరాత్రి పర్వదినాన్ని జరుపుకుంటాం. ప్రతి నెలా వచ్చేది మాసశివరాత్రి, ఏడాదికి ఒకసారి వచ్చేది మహాశివరాత్రి. మహాశివరాత్రి అనగానే 'పరమును' అనగా మన గమ్యమును గుర్తు చేసే రోజు. మనందరికి ఒక గమ్యం ఉంది. అదే దేహాత్మబుద్ధి నుండి విడుదల పొందడం, అహంకారాన్ని అంతమొందించడం. మన సంస్కృతిలో అనేక పండుగలు పర్వదినాలు జరుపుకుంటాం, పండుగ అనగానే విందులు, వినోదాలు గుర్తుకొస్తాయి. కానీ మహాశివరాత్రి విభిన్నమైన పర్వదినం కారణంగా ఆ రోజున ఉపవాసం చేస్తాం, జాగరణ చేస్తాం. ఉపవాసం వల్ల శరీరానికి ఆరోగ్యం, శివస్మరణ వల్ల మనస్సుకి ఆరోగ్యం కలుగుతుంది. శివుడికి రుద్రుడు అనే మరో పేరు ఉంది. రుద్రుడు అంటే సంసార దుఃఖానికి బీజకారణమైన అజ్ఞానాన్ని నశింపజేసేవాడు అని అర్థం. 'శివుడు' అంటే మంగళ ప్రదుడు, శాంతి స్వరూపుడు, ద్వైతబుద్ధిని ధ్వంసం చేసేవాడు, శుభాన్ని ఇచ్చేవాడు. 'శివ' అంటే అన్నిటిలోనూ, అందరిలోనూ తానై ఉండి సకలమునకు ఆధారముగా ఉండేవాడు. 'శివరాత్రి' అంటే అవ్యక్తమైన, నిరాకారమైన పరమాత్మ లింగరూపం ధరించిన రోజు. ప్రపంచంలో ఏమి జరుగుతోందో చూడడం, విచారించడం సరే మన లోపల ఏమి జరుగుతోందో చూడాలి. జీవుడిని మరల మరల శరీరంలోకి తీసుకురావడానికి 'నాది' అన్న చిన్న తలంపు సరిపోతుంది. అహంకార, మమకార రూపంలో ఉన్న దేహాభిమానం నశించకుండా ఆత్మజ్ఞానం కలగదు. విశ్వమంతా సాక్షాత్తూ శివ స్వరూపమే. అష్టమూర్తులు అనగా జీవకోటి, నక్షత్రాలు, గ్రహాలు, పంచభూతాలు మున్నగునవి అన్నీ వేటికవి వేరువేరుగా కనపడుతున్నప్పటికీ ఇవన్నీ విశ్వంలోని అంతర్భాగాలే, అన్నిటికీ ఆధారంగా ఉన్న చైతన్య స్వరూపం ఒక్కటే, ఆ చైతన్య స్వరూపుడే అనంతుడైన పరమశివుడు. సకల చరాచర జగత్తు పరమ శివునిలోనిదే. సముద్రం ఒక్కటే అయినప్పటికీ అందులోంచి ఎన్నో అలలు వస్తూ ఉంటాయి కానీ ఆ అలలన్నింటికీ మూలము సముద్రమే కదా. అలలన్నింటికీ సముద్రం ఎలా ఆధారమై ఉందో ఈ సమస్త విశ్వంలోని సకలమునకు ఆధారమైన తత్త్వమే పరమశివుడు. అందుకే ఆయనను 'విశ్వనాధుడు' అంటారు. మూడు అవస్థలు, మూడు గుణాలు, మూడు శరీరాలు, మూడు కాలాలు దాటిన వారికి శివుడు స్వరూపంగా వ్యక్తమౌతాడు. దేహమే దివ్యక్షేత్రం, హృదయమే శక్తి పీఠం, శివుడే పీఠాధిపతి.

**(దిః 08-03-2024 మహాశివరాత్రి సందర్భముగా)**

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

# నిరహంకారి మాత్రమే - నిర్వికారంగా ఉండగలడు

నేను మహాపండితుణ్ణి నాకు అన్నీ తెలుసు అసలు నా మాట వింటే ప్రపంచము ఎప్పుడో బాగుపడును అని అహంకారి తనలో తనే గొణుక్కుంటాడు. ఈ భావాలు ఉంటే విశాలభావాలకు చోటు ఉండదు. నీటి వల్లనే మంచు గడ్డ ఏర్పడుతుంది. తిరిగి మంచుగడ్డ కరిగి నీరు అవుతుంది. అహంకారం ఆత్మ వెలుగులోనే బ్రతుకుతుంది. అహంకారం గడ్డ కట్టటం వలనే అనేక వికారాలు వస్తాయి. నాకు ఏమీ తెలియదు నావల్ల ఏమీ జరగటంలేదు పరమాత్మచేతిలో ఒక కీలుబొమ్మను అని భావిస్తే అహంకారం కరిగిపోతే, ఆత్మలాగే ఉండగలము. “ఆత్మ ఎలా ఉందో అది ఎప్పుడూ అలాగే ఉంది. ఈ బుడబుక్కల మనసే గోల చేసేది. ఇక చెప్పటానికి ఏముంది? అహంకారం ఉంటే అంతా ఉంది అది లేకపోతే ఏమీ లేదు” అంటారు శ్రీ నాన్నగారు. మనస్సులో ఏవికారం లేకపోతే మేఘాలు లేని నిర్మల ఆకాశంలాగా, కెరటాలులేని నిర్మల సరస్సులాగా ఉంటుంది. మన శరీరం మరణిస్తే పూచికపుల్లకూడా మన వెంటరాదు. భార్య ఎంత ఏడ్చినా ఇల్లు దాటిరాదు. బంధువర్గం కొందరు స్మశానం వరకూ వస్తారు. మన దేహం చితివరకే వస్తుంది. జీవుడి కూడా వచ్చేది ధర్మం మాత్రమే ఇన్నీ తెలుసున్న పండితుణ్ణి కూడా ఇంద్రియాలు పట్టి ఈడ్చుకొనిపోతాయి. కాకిరెట్టను చూస్తే ఎంత రోత కలుగుతుందో విషయాలపై మనం అలా ఉంటే వైరాగ్యం సిద్ధిస్తుంది. బుద్ధిని మోహింపచేసే ఆశను శోకింపజేసే నిరాశను ఒకేసారి విడిచిపెడితే వైరాగ్యం కలిగి నిర్వికారంగా ఉండగలడు. ఆలోచనలకు సొంతజీవితం అంటూ లేదు అవి వాసనలను బట్టి బ్రతుకుతాయి. మనం వాటితో కలిసిపోయి జీవిస్తున్నాము. మనం కోపంగా ఉన్నామంటే మనమే కోపానికి జీవనశక్తి ఇస్తున్నాము. మనం అందులో మిళితమైపోయి ఉన్నాము. మనం ఆలోచనలకు దగ్గరగా ఉంటే వాటిని మనం గమనించలేము అవి మనకు అలంకారమైపోతాయి. కోపంతో మనం పిచ్చివాడిగాను, ఆశతో ఆశాపాతునిగాను, కామంతో కామిగాను తయారు చేస్తుంది. అవి అన్ని మనలను కప్పేసి ఉన్నాయి. ఆలోచనలూ, మనమూ ఒకటే అనుకోవటం వలన వచ్చిన తంటాలు, తగువులు. దుఃఖాన్ని తీసుకొని వచ్చే ఇటువంటి పనులలో మునిగిపోకూడదు. సాధారణ జీవి ఆలోచనలు లేకుండా ఒక్క క్షణం ఖాళీ లేకుండా ఉండలేడు ఆలోచనలు ఎప్పుడూ తన్నుకుంటూ ఒకదానిమీద ఒకటి ప్రవాహంలా చిన్న విరామం లేకుండా కొనసాగుతాయి. మనం సూక్ష్మదృష్టితో మన మనస్సును పరిశీలిస్తే మనకే తెలిసిపోతుంది. భగవాన్ “మీ మనస్సు కదిలిపోతున్నది అంటున్నారు నా మనస్సు కదలమన్నా కదలటంలేదు” అన్నారు. జ్ఞాని స్థితి అది. పోనీ మనం నిద్రలో ఉన్నా మనకు కలిగే కలలు అన్నీ దృశ్యరూపంలోని మన ఆలోచనలే. జాగ్రదవస్థలో మనం దర్శించేవే నిద్రలో అవి తారసపడతాయి. సాధకుడు జాగ్రదవస్థలో నిగ్రహించుకొన్నా వాసనలు నిద్రలో మన ఆట సాగనియ్యకుండా యధేచ్ఛగా సాగుతాయి దీని ప్రవాహాన్ని ఆపలేము. మన సాధన పురోభివృద్ధి ఎలా ఉందో తెలియటానికే ఈశ్వరుడు కలలు అనే జ్వరం ఎలా ఉందో తెలియటానికే ధర్మామీటరులా నియమించాడు. దానికి ఇంతకన్న ప్రయోజనం ఏమీ లేదు. దానికి కరుణాకటాక్షం ఒక్కటే మందు. దానితో ఆలోచనల నుండి విరక్తులమై నిర్వికారంగా ఆత్మగా తేజరిల్లుతాము. అంతే.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966**